పేకాట పోలీసులపై సస్పెన్షన్
- పట్టుబడిన వెంటనే ప్రాథమిక విచారణ... బదిలీ
- సమగ్ర విచారణ అనంతరం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- సత్తెనపల్లి కానిస్టేబుల్‌పై పల్నాడు ఎస్పీకి నివేదిక

8

చదలవాడలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

6

ఆ నలుగురికే.. పని

- సచివాలయాల్లో వారిపైనే భారం
- మిగిలిన ఉద్యోగులకు నామమాత్రం
- అస్తవ్యస్తంగా సచివాలయాల నిర్వహణ
- మా ఇష్టం.. ఎప్పుడైనా వస్తామన్నట్లుగా తీరు
- హేతుబద్ధీకరణ ప్రహసనం.. విధుల్లో గందరగోళం



బాపట్ల : వార్డు సచివాలయం విధి నిర్వహణలో సిబ్బంది

ఆంధ్రజ్యోతి పరిశీలన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన ప్రక్రియ అంతకంతకూ జఠిలంగా మారుతోంది. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ ప్రక్రియ కొందరికి వరంగానూ, మరికొందరికి శాపంగానూ మారింది. ఆ నలుగురిపైనే పనిభారం అన్నట్లు ప్రక్రియ సాగింది. అదనపు సిబ్బందిగా ఉన్నారని గుర్తించిన మిగిలిన ఉద్యోగులకు నిర్దిష్టమైన విధులు లేకపోవడంతో వారు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటరీ సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వహించేవారికే పని ఉంటోంది. వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరి, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్ అసిస్టెంట్, వార్డు ఎమినిటీస్ సెక్రటరి, శానిటరీ అసిస్టెంట్లకే నిర్దిష్టమైన విధులు ఉన్నాయి. మిగిలినవారి విధుల విషయంలో ఒకింత గందరగోళం నెలకొని ఉంది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రం బిజీ అయిపోయారు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో కొందరిని మాతృశాఖ సహా పలు ఇతర శాఖలకు పంపించారు. ఆ కారణంగా ఆయా సచివాలయాల విధులు కూడా వీరిపై పడుతున్నాయి. సచివాలయాల్లో స్థానిక సంస్థలైన పంచాయతీ, మున్సిపాలిటీల అనుబంధ విధుల్లో ఉండే వారికి మాత్రమే పనులు ఉంటున్నాయి. మిగిలిన వారందరికీ ప్రత్యేక సందర్భాల్లో మినహా మిగిలిన సందర్భాల్లో పని ఉండడం లేదు. సచివాలయ సిబ్బందిలో కొంతమందికి ప్రభుత్వం సచివాలయాల విధులతో పాటు, మాతృశాఖల విధులను కూడా కేటాయించింది. ఇలా రెండు చోట్ల పనిచేయాల్సి వచ్చినవారు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇలా రెండు చోట్ల విధుల్లో ఉండే ఉద్యోగుల్లో పలువురు అక్కడ ఉన్నామని (మిగతా 6వ పేజీలో)



అరకొర సిబ్బందితో చీరాల పట్టణంలోని 15వ వార్డు సచివాలయం

అక్రమ అంతస్తుల.. క్రమబద్ధీకరణ

బీపీఎస్ పునరుద్ధరణ

- ఆగస్టు 31 ముందు నిర్మించిన భవనాలకు వర్తింపు
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- బిల్డర్లకు ఊరట.. పురాలకు కాసుల వర్షం

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. బిల్డింగ్ పెనలైజేషన్ స్కీం (బీపీఎస్)ను పునరుద్ధరిస్తూ జీవో ఎంఎస్ నం బరు 225ను బుధవారం జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన బీపీఎస్‌ను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిలిపి వేసింది. ప్రస్తుత ఏన్డీఏ కూటమి ప్రభుత్వం గతంలో లేఅవుట్లు(ఎల్‌ఆర్ఎస్), ఇప్పుడు భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లైసెన్స్ ఇంజనీర్లు, బిల్డర్స్, నగర ప్రజలు తమ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. బీపీఎస్ మునిసిపాలిటీలకు కాసుల వర్షం కురిపించ నుంది. రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరనుంది.



ప్లాన్‌లు అతిక్రమించి నిర్మిస్తున్న భవనాలు

బాపట్ల, చీరాల నవంబరు 12(ఆంధ్రజ్యోతి):

నిబంధనల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి ముందు నిర్మాణం పూర్తయిన.. 1985 జనవరి ఒకటో తేదీ నుంచి నిర్మించిన భవనాలకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. అంతకు ముందు నిర్మించిన భవనాలకు ఈ పథకం వర్తించదు. 1997కు ముందు నిర్మించిన భవనా లకు జరిమానా 25 శాతం తగ్గిస్తారు. భవనా లకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెం టేషన్, ఫొటోలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. గుంటూరు నగరపాలక సంస్థలో సుమారుగా పది వేలకు పైగా భవనాలు బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. తద్వారా గుంటూరు నగరంలో రూ.60కోట్ల నుంచి రూ.70 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు.

120 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసి పాలిటీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వేలాది భవనాలను క్రమబద్ధీకరించనున్నారు. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు నోటిఫికేషన్ వెలుబడిన తేదీ నుంచి 120 రోజుల్లోగా తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 'బీపీఎస్. జీవోవీ. ఇన్' వెబ్‌సైట్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, సీఆర్డీఏ పరిధిలోని భవనాలకు మాత్రమే బీపీఎస్ (మిగతా 8వ పేజీలో)

మురికి వాడలకు 50 శాతం రాయితీ

మురికి వాడల్లో నిబంధనలు అతిక్రమించిన నిర్మించిన భవనాలకు బీపీఎస్ అపరాధ రుసుం 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా ప్రాంతాల వారీగా ఉన్న మార్కెట్ విలువల ఆధారంగా అపరాధ రుసుం విధించబడుతుంది. భవనంలో ఎక్కడి వరకు అయితే.. అక్రమ నిర్మాణమో.. దాని వరకు మాత్రమే పెనాల్టీలు విధిస్తారు. మిగతా ప్రాంతాల్లో యథావిధిగానే ఫీజులు కొనసాగుతాయి.

వేడుకగా గృహప్రవేశాలు

- 5,496 ఇళ్లలో చేరిన లబ్ధిదారులు
- జిల్లా స్థాయిలో వేమూరులో కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్
- కార్యక్రమాల్లో చీరాలలో ఎమ్మెల్యే కొండయ్య, బాపట్లలో వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కల నెరవేర్చే దిశగా గతంలోనే ప్రభుత్వం కార్యాచరణ రూపొందించగా బుధవారం ఆయా లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు వేడుకగా జరిగాయి.



వేమూరు: గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లా స్థాయి కార్యక్రమం వేమూరు మండల పరిధిలోని చదలవాడ గ్రామంలో జరిగింది. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులతో పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు చేయించారు. బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల వన్‌టౌన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో టీడీపీ స్థానిక నేతలు, అధికారుల సమక్షంలో గృహ ప్రవేశాలు జరిగాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ 1.0లో భాగంగా జిల్లాలో 46,444 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేపట్టదలచింది. ఇందులో 5,496 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకోగా బుధవారం గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో లాంఛనంగా గృహప్రవేశాలు జరిగాయి. అద్దంకి నియోజకవర్గంలో 7,376 ఇళ్లకు 1,101 గృహాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. చీరాలలో 4024 గృహాలకు 286, పర్చూరులో 7,195 గృహాలకు 938, బాపట్లలో 6,000 ఇళ్లకు 724, రేపల్లెలో 8,935 ఇళ్లకు 1,386, వేమూరులో 12,914 గృహాలకు 1061 ఇళ్ల నిర్మాణం పూర్తి అయినట్లు గృహనిర్మాణశాఖాధికారులు తెలిపారు.

14 నెలల్లో 1061 ఇళ్లు పూర్తి

వేమూరు: నియోజకవర్గంలో 14 నెలల కాలంలో 1061 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారుల చేత ఒకే రోజు గృహ ప్రవేశాలు చేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం చదలవాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా నిర్మితమైన గృహాలను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణాల పేరుతో దళారీ వ్యవస్థ ద్వారా, స్థలాలు కొనుగోళ్లు, మెరకల పేరుతో నేతలతో కలిసి రూ.కోట్లు దండుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు నిర్మాణం చేయడంతో పాటు 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ఇప్పటికే 60 శాతం నిర్మాణాలు పూర్తి కాగా డిసెంబరు నాటికల్లా నూరుశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, హౌసింగ్ డీఈ సీతారామయ్య, పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

● బాపట్ల రూరల్: బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాసయోజన గ్రామీణ అర్బన్ పథకం ద్వారా నిర్మించిన గృహాలను బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ సలీమా, టీడీపీ మండల, గ్రామ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, ఆశీర్వాదం, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామయ్య తదితరులు పాల్గొన్నారు.



గోపాపురంలో గృహపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నాణ్యమైన భోజనం అందించాలి
- ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

అద్దంకి, పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థు లపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి తెలిపారు. బుధవారం పర్చూరు మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల, నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల వసతి గృహం, ఉప్పుటూరులోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం, జడ్పీ ఉన్నత పాఠశాలలో, మార్టూరులోని ఎస్సీ బాలికల వసతి గృహం, నేతాజీ నగర్‌లోని రేషన్ దుకా ణం, అద్దంకిలోని సివిల్ సప్లయిస్ గోడౌన్, చక్రాయపాలెంలో రేషన్‌షాపు, శింగరకొండ వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను, అద్దంకి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహం, కళాశాల వసతిగృహాలను దేవి తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, మెనూ విధానం, శుభ్రత వంటి అంశాలను ఆమె పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలో తయారు చేయకుండా ఇంటి నుంచి తీసుకురావడం, గంజి వంచి తయారుచేసిన భోజనంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

సేంద్రియ సాగుతో పర్యావరణానికి మేలు ● శిక్షణా తరగతుల్లో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముత్తాయిపాలెంలో రైతుసాధికార, ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, అందరూ సేంద్రియ పద్ధతిలో సాగు చేసేలా చూడాలన్నారు. మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం 365 రోజులు ఉండటం వల్ల నిరంతరం డబ్బు సంపాదించవచ్చన్నారు. పెట్టుబడి తగ్గుతుందని గ్రామాలు పచ్చదనాన్ని సంతరించుకుంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పంటలు తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయన్నారు. ఇటీవలమొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వ్యవసాయపరంగా రూ.370 కోట్ల నష్టం వాటిల్లిందని ఇది ప్రభుత్వంపై భారవమవుతుందన్నారు. నష్టం జరగకుండా ఉన్నట్లైతే ఆ డబ్బుతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే కార్యక్రమాలకు ఉపయోగపడేదన్నారు. సేంద్రియ విధానంలో సాగు వల్ల భూమిలో పోషకాల్లో నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. శిక్షణ పొందినవారు మిగిలిన వారికి రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం సంక్షిప్త మార్గదర్శిణి, వివిధ పంటలలో పురుగులు, తెగుళ్ల నివారణ, యాజమాన్య దీపికను కలెక్టర్ ఆవిష్కరించారు. 9 సార్వత్రిక సూత్రాలు గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారిఅన్నపూర్ణ, తహసీల్దార్ షేక్.సలీమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం చేసే సార్వత్రిక సూత్రాలను కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

రోడ్డుపాలైన బాలామృతం

- చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు నిరుపయోగం
- గడువు తీరిపోవడంతో పారవేత

ఇంకొల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు, బాలింతలకు అందించాల్సిన బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు రోడ్డు పాలయ్యాయి. పిల్లలకు, బాలింతల ఆరోగ్యం కోసం కేటాయించిన సరుకులు పంపిణీలో జాప్యంతో నిరుపయోగంగా మారాయి. గడువు తీరిన బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు పారేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు నుంచి కడవకుదురు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో బాలామృతం, చిక్కీ ప్యాకెట్లు బుధవారం అధికసంఖ్యలో దర్శనమిచ్చాయి. గడువు తీరిన ప్యాకెట్లు ఏ అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులో తీసుకువచ్చి ఇలా పడేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు. ఇలా బలవర్ధకమైన ఆహార పదార్థాలను సకాలంలో పంపిణీ చేయకుండా గడువు తీరాయని తీసుకొచ్చి ఇలా పారేయడంపై స్థానికుల్లో చర్చనీయంశమైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం చిక్కీ ప్యాకెట్లు, కోడిగుడ్లు పారేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. రెండు రోజులుగా పర్చూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేస్తుండగా ఆ భయంతో గడువుతీరిన వాటిని ఇలా పడవేసి ఉండారని భావిస్తున్నారు. గతంలో కూడా ఇదే విధంగా జరిగిందని ఆ పరిసర ప్రాంతవాసులు తెలిపారు. అప్పుడు చర్యలు లేకపోవడంతో పునరావృతమైందన్నారు.



రోడ్డు పక్కన పడేసిన ప్యాకెట్లు

సాక్ష్యాల సేకరణలో క్లూస్‌టీం కీలకం

- క్లూస్‌టీం వాహన పరిశీలనలో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేర స్థలాల్లో సాక్ష్యాలను సేకరణలో క్లూస్ టీం కీలకపాత్ర పోషించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన మూడు క్లూస్‌టీం వాహనాల్లోని సాంకేతిక పరికరాలను బుధవారం పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణలో స్వయంగా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా క్లూస్‌టీం సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరస్థలంలోని భౌతిక సాక్ష్యాల సేకరణ ఆధారంగా నిందితులను గుర్తించడంలో, వారికి శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం సాంకేతిక బృందం పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. వాహనాల ఆధారంగా సాంకేతిక బృందం వేగంగా నేరస్థలానికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. రక్తపు నమూనాలను సేకరించడానికి, వేలిముద్రలు తీయడానికి నేరస్థలంలో ఆధారాలను భద్ర పర్చడానికి, సేకరించిన సాక్ష్యాలను పరిరక్షించడానికి, ఫొటోలు తీయడానికి, డ్రాయింగ్ వేయడానికి ఉపయోగపడే పరికరాలు ఆయా వాహనాల్లో ఉన్నాయన్నారు. వీటిని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



క్లూస్‌టీం వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలి

ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగవంతంగా ఆన్‌లైన్ చేయాలని ఎస్పీ తెలిపారు. సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ఎస్పీ పరిశీలించి సాంకేతిక సిబ్బందికి పలుసూచనలు చేశారు. ప్రతిపోలీసుకి సంబంధించిన శాఖా పరమైన, వ్యక్తిగత వివరాలను ఖచ్చితంగా ఈఎస్ఎంలో పొందుపర్చాలన్నారు. నెలాఖరి నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్, క్లూస్ టీం ఎస్ఐ వెంకటేష్, ఏవో బి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఓబీసీ గణన చేపట్టాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

● సీఎస్‌కు ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతల విజ్ఞప్తి


సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న కేసన, క్రాంతికుమార్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓబీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్‌లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో బుధవారం సీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఓబీసీ కుల గణన నిర్వహించాలని హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం పిల్ దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నాలుగు వారాల గడువు అడిగిందని చెప్పారు. ప్రభుత్వం పారదర్శకంగా కమిషన్ వేసి ఓబీసీ జనగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని విన్నవించారు. విద్య, ఉపాధి, రాజకీయాల్లో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు కేసన పేర్కొన్నారు.

నేడు ఆచార్య రత్నషీలామణికి సన్మానం

ఏఎన్‌యూ నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ఆచార్య రత్నషీలామణి సన్మాన కార్యక్రమం గురువారం ఏఎన్‌యూలో జరగనుంది. వర్సిటీ ఏఎన్‌యూ ఉద్యోగులు, పరిశోధకులు సంయుక్తంగా ఆమెను సత్కరించనున్నారు. వర్సిటీ ఆడిటోరియంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం హాజరుకానున్నారు. ఏఎన్‌యూ రెక్టార్‌గా పనిచేస్తూ ఏపీ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలుగా ఆచార్య రత్నషీలామణి నియమితులైన సందర్భంగా ఆమె సేవలకు గుర్తింపు సన్మానించనున్నట్లు వికాస కార్యవర్గం ఒక బుధవారం ప్రకటనలో తెలిపింది.

తేమ శాతం సడలింపునకు సీసీఐని కోరుతాం

● మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత


పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎం.విజయ సునీత

సత్తెనపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 30 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 62 జిన్నింగ్ మిల్లులను గుర్తించి వీటి ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. పట్టణంలోని అమరావతి మేజరు కాలువ పక్కన గల లక్ష్మీ కాటన్ ట్రేడ్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025 - 26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగులో ఉందన్నారు. ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అంచనా వేశామని తెలిపారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలోని అన్ని చోట్ల పత్తి కొనుగోళ్లు వేగంగా జరుగుతాయన్నారు. ప్రభుత్వం క్వింటాల్ పత్తి మద్దతు ధర రూ.8,110 ప్రకటించిందని, తేమ శాతం ఎనిమిది ఉంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉంటే మద్దతు ధర తగ్గుతుందన్నారు. బ్యాగ్‌లలో పత్తిని తేవద్దని రైతులకు సూచించారు. మొంథా తుఫాన్ వల్ల పత్తిలో తేమ శాతం పెరిగే అవకాశం ఉందని సంబంధిత శాఖ మంత్రికి తెలియజేశామన్నారు. మంత్రి ద్వారా సీఎంకు, సీఎం నుంచి సీసీఐ అధికారులకు విషయాన్ని వివరించి సడలింపులు ఇవ్వాలని కోరతామన్నారు. పత్తి కొన్న వారంలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని విజయ సునీత తెలిపారు. ముందుగా ఆమె కొనుగోలు కేంద్రంలోని పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం మండలంలోని నందిగామ వద్ద పత్తి పంటను పరిశీలించారు. ఆర్ఎస్కేలో కపాస్ కిసాన్ యాప్, సీఎం యాప్‌లలో రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. జేడీ కె.శ్రీనివాసరావు, డీడీ దివాకర్, సత్తెనపల్లి ఏఎంసీ కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, ఏఓ బి.సుబ్బారెడ్డి, ఏఈవో వై ఏసోబు తదితరులు ఉన్నారు.

కబడ్డీ జట్టుకు కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందన


కబడ్డీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ -16 కబడ్డీ పోటీల్లో బాపట్ల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బుధవారం పీజీఆర్ఎస్ హాలులో అభినందించారు. ఇటీవల కడపలో నిర్వహించిన 35వ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా బాలుర జట్టు మొదటి స్థానంలో, బాలికల జట్టు మూడోవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దాలని డీఎస్‌డీవో శ్రీనివాసులును కలెక్టర్ ఆదేశించారు. క్రీడాకారులతో మాట్లాడి.. వారి ఆసక్తులను తెలుసుకున్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు హరియాణాలోని సోనీపట్‌లో జరగనున్న 35వ జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న, జిల్లా నుంచి ఎంపికైన ఎస్.హేమంత్, ఎస్‌కె. జుబేల్‌ను మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివాసరావు ఉన్నారు.

● జిల్లాలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆయన అవిష్కరించారు. ఆత్మనిర్భర్ భారత్‌కి సహకార సంఘాలు వాహనాలు అనే నినాదం వారోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. జిల్లా సహకార అధికారి సి.హెచ్.శ్యాంసన్, ఎల్.సుధాకరరావు, శివచైతన్య, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా సోషియల్ అవేర్నెస్ అండ్ యాక్షన్ ఆన్ న్యూమోనియా కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యితో జగన్, అనుయాయుల దోపిడీ: పిల్లి మాణిక్యరావు



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు, చిట్టిబాబు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ చేసి జగన్, అతడి అనుయాయులు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి లడ్డూ విషయంలోనూ వైసీపీ అవినీతికి పాల్పడిందని చెప్పారు. తిరుపతి లడ్డూ విషయంలో చాలా మంది అరెస్ట్ అయ్యారని, ఆనాడు ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి 'కల్తీ జరిగింది నిజమే, పైవాళ్ళు చెప్తేనే చేశామ'ని ఒప్పుకున్నాడని అన్నారు. దొరికిపోయామని తెలిసిపోయాక జగన్ ఆవుల మీదకు నెపం నెట్టేశాడని, ఆవు మంచి గడ్డి తినకపోతే పాలు కల్తీ జరుగుతాయని చెప్తున్నాడని అన్నారు. అలాంటి వ్యాఖ్యలు కేవలం గడ్డి తినేవాళ్లే చేస్తారని మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రపంచంలో ఏ తల్లిపాలు కల్తీ కావని, అది మానవులైనా, జంతువులైనా... జగన్ లాంటి వాళ్లే కల్తీ చేస్తారని విమర్శించారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో కలిపే నెయ్యిని కల్తీ చేసి బుకాయించడమంటే ఆ దేవుడి ఆగ్రహానికి గురికాక తప్పదని, చేసిన తప్పుకు జగన్ జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు), కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.

ఎక్కువ తేమ ఉన్నా..పత్తిని కొనుగోలు చేయాలి

● కేంద్ర మంత్రికి జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ విజ్ఞప్తి


మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేసిన ఇక్కుర్తి, మన్నవ

గుంటూరు సిటీ, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితి, అధిక తుఫాన్ ప్రభావం దృష్ట్యా తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేసేలా సీసీఐకి ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పత్తి మిల్లుల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులో ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మన్నవ హరినాథ్ బాబు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. తుఫాన్ వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బ తిందని, ఈ పరిస్థితిలో కూడా సీసీఐ అధికారులు పత్తి తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటే మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని వివరించారు. పత్తిలో నలక శాతం కూడా ఎక్కువగా ఉంటుందని దానిపై కూడా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నేతల విజ్ఞప్తిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర, పక్కన డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు పార్టీలో సమచిత స్థానం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పునరుద్ఘాటించారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన పొన్నూరు నియోజకవర్గంలోని మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఎన్నికల పరిశీలకుడు కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేసి అనంతరం కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని.. వారే నిజమైన సైనికులన్నారు. అందరూ క్రమ శిక్షణతో పని చేస్తూ.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు చాలా కష్టపడినట్లు తెలిపారు. అలుపెరగని పోరాటాలు చేసామని గుర్తుచేశారు. ప్రజల పక్షాన పోరాడినందుకే గత వైసీపీ ప్రభుత్వం కేసులు పెట్టిందని, అయినా వాటి గురించి పట్టించుకోకుండా ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామన్నారు. కార్యకర్తలు నిత్యం ఇదే జోరు కొనసాగిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా నిర్మించే మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తున్నారని వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అసలు దేవుడి దగ్గరే దోపిడీ చేసిన నాయకులు ఎవరైనా ఉన్నారంటే అది వైసీపీ నాయకులేనని ఎద్దేవా చేశారు. పదవులు పొందిన ప్రతీ ఒక్కరూ ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని దిశా నిర్దేశం చేశారు. మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు పాల్గొన్నారు.

న్యూమోనియా మరణాలు నియంత్రించాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవించే న్యూమోనియా మరణాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శాన్స్ పథకం సత్ఫలితాలు సాధించేందుకు వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి కోరారు. వరల్డ్ న్యూమోనియా డే పురస్కరించుకొని బుధవారం ఆసుపత్రి శిశు వైద్య విభాగంలోని డాక్టర్ బ్రహ్మానందం మెమోరియల్ సెమినార్ హాల్‌లో జరిగిన "సోషల్ ఎవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్లీ" (శాన్స్) అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శాన్స్‌లో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులకు న్యూమోనియా సోకకుండా తల్లులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో నవంబరు 12 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు శాన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, వైద్యులు డాక్టర్ బి.దేవాకుమార్, డాక్టర్ అరుణకుమారి, ఉషారాణి, డాక్టర్ పొదిలి ప్రసాద్, రాజా కరణం, ఎలిజెబెత్, సునీత, రమేష్, వీరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

43,348 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 45,295 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,348 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,691 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	17000
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	17000	273	----	----
4884	----	----	341	10000	17200
సూపర్ 10	----	----	4884	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	17500
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16300
దేవనూరు డీలక్స్	10500	16400	తాలుకాయలు	5000	8800

చదలవాడలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● అర్జీలు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్


చదలవాడ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదలవాడలో బుధవారం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. గ్రామ ప్రజలు అనేక సమస్యలను అర్జీల రూపంలో వారికి అందజేశారు. అనేక మంది రెవెన్యూ సమస్యలపై ఆధార పూర్వకంగా అందించిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులను ఏ ఒక్క సమస్యనూ.. పెండింగ్‌లో ఉంచకూడదని వెంటనే పరిష్కరించాలని ఆదేశిస్తూ కొన్ని సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు తమ పైర్లు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ వ్యవసాయ శాఖ కన్నెత్తి చూడలేదని, తిరిగి సర్వే నిర్వహించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించాలని కోరారు. దివ్యాంగులు చిరువ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలను తెలియజేసి.. తక్షణమే సాయం అందే విధంగా చూడాలని ఏపీఎం శోభన్‌ను కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావం కూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను పరిష్కరించలేదని నివాసితులు విన్నవించుకున్నారు. దీనిపై తక్షణ చర్యలకు ఎందుకు తీసుకోలేదని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వెంటనే ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణం కోసం.. పంచాయతీ శాఖ అధికారులు అంచనాలతో కూడిన ప్రతిపాదన తయారు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తమ కుటుంబానికి చెందిన భూ వివాదం కోర్టులో ఉండగా.. అధికారులు వివాదాన్ని పెంచే విధానంలో వ్యవహరిస్తున్నారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో.. తొందరపాటు చర్యలు తీసుకోవద్దని తహసీల్దార్ సుశీలకు సూచించారు.

ఆ నలుగురికే పని

(5వ పేజీ తరువాయి)

చెప్పి ఇక్కడ, ఇక్కడ ఉన్నామని చెప్పి అక్కడ విధులకు గైర్హాజరవుతున్నారు.

సమస్యల వలయం..

జిల్లాలో సచివాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంలేదని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఎవరిష్టం వచ్చినట్లు వారు వస్తున్నారు.. పోతున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా కొలువుదీర్చిందే తప్ప ఎక్కడా కూడా పారదర్శకత, సహేతుకతకు చోటు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో సచివాలయాల రేషనలైజేషన్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన ఇది తయారైందే తప్ప ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియ సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టకపోగా చిక్కుముళ్లను అలాగే మిగిల్చింది. ఇవన్నీ ఒక ఎత్తయితే అవసరం లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్ నియామకం మొదలుకుని, సదరు సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఇష్టారీతిన వివిధ విభాగాల్లో నియమించుకోవడం ఇవన్నీ కూడా యథావిధిగానే సాగుతున్నాయి. ప్రభుత్వం చెప్పినట్లుగా ఎక్కడా కూడా సిబ్బంది నియామకంలో జనాభా ప్రామాణికం అమలవుతున్న దాఖలాలే కనిపించడం లేదు. దీంతో సచివాలయాలు ఇంకా సమస్యల వలయంలోనే ఉన్నట్లు క్షేత్రస్థాయిలో కనబడుతోంది.

గతంలోనూ, హేతుబద్ధీకరణ తర్వాత కూడా.. జిల్లాలో 477 సచివాలయా లు, 3,500 మంది సిబ్బంది ఉండటం ఎలా సాధ్యమనేది అంతుబట్టని ప్రశ్నగా ఉంది. అవసరం లేని విభాగాల్లో దాదాపు 400 మంది సిబ్బంది ఉన్నారని వారిని సర్దుబాటు చేసి ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. సీన్ కట్ చేస్తే అవే సచివాలయాలు, సిబ్బంది సంఖ్యలో కూడా మార్పులేదు. కానీ రేషనలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో దాదాపు 30 శాతం మంది డిప్యూటేషన్‌పై కలెక్టరేట్ విభాగాల్లోని పనిచేయడమో లేక ఫీల్డ్ విజిట్‌లో ఉండడమో జరుగుతోంది. ఒక సచివాలయంలో అడ్మిన్‌గా వ్యవహరిస్తున్న ఉద్యోగి మరో సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరిగా విధులు నిర్వహిస్తు న్నారు. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా 40 శాతం సచివాలయాల్లో దర్శన మిస్తున్నాయి. తాజాగా జరిగిన బదిలీల వల్ల కూడా సచివాలయాల్లో దాదాపు 120 వరకు ఖాళీలు ఏర్పడినట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సుబ్రహ్మణ్యం గుప్తా నా అనుచరుడు కాదు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల,నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : విశాఖలోని గోమాంసం కేసుకు సంబంధించిన సుబ్రహ్మణ్యం గుప్తా తన అనుచరుడుకాదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తనతో కలిసి షటిల్ ఆట ఆడుతూ స్నేహితుడిగా మాత్రమే ఉన్నాడన్నారు. విశాఖలోని అతని కోల్డ్‌స్టోరేజి లీజుకు ఇవ్వటం జరిగిందన్నారు. అందులో గోమాంసం నిల్వ చేస్తారని ఆయనకు తెలియదన్నారు. అటువంటి వ్యాపారాలకు ఎవరు ఇవ్వరన్నారు. గోమాంసం నిల్వ చేశారని తెలిసిన తర్వాత వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. గోమాంసం వ్యాపారంలో భాగస్వామ్యం ఉందని ప్రచారం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఏ వ్యాపారం చేసిన నీతిగా నిజాయితీగా, ధర్మంగా చేస్తానే తప్ప ఇలాంటి పనులు తాను చేయనని ఎమ్మెల్యే వేగేశన స్పష్టం చేశారు.

బాపట్ల నియోజకవర్గ మండల, క్లస్టర్, ప్రమాణస్వీకారం

బాపట్లరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా ఎన్నికైన మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్, అనుబంధ కమిటీల సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, బాపట్ల పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కాముల సాంబశివరావు, సీనియర్ టీడీపీ నాయకులు పమిడి భాస్కరరావు, తోట నారాయణ, మందపాటి ఆంద్రేయ, పిట్లలవానిపాలెం, కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షులు అప్జల్, ఏపూరి భూపతిరావు, వెంకటపతిరాజు, బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ

ఎమ్మెల్యే వేగేశనపై ఆరోపణలు దారుణం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు

● అంబేద్కర్ సర్కిల్‌లో జగన్ మీడియా పత్రిక ప్రతులు దహనం

బాపట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నిషేధిత గోమాంసం కేసులో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఉన్నారంటూ ప్రచారం చేయటం దారుణమని, దీనిని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో బుధవారం జగన్ మీడియా పత్రికను టీడీపీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా గొలపల శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యంగుప్తా వ్యాపారస్తుడు కావటం వల్ల ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులతో ఉంటాడన్నారు. టీడీపీతో కూడా సంబంధంలేని వ్యక్తిని ఎమ్మెల్యే అనుచరుడిగా పేర్కొంటూ కథనాలు ప్రచురించటం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు మందపాటి ఆంద్రేయ, చివుకుల దుర్గాప్రసాద్, చాపా సోమయ్య, ఎస్‌సి సెల్ నాయకుడు కూచిపూడి శ్యామ్‌సుందర్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు బూర్లె రామసుబ్బారావు, జిట్టా శ్రీనివాసరావు, పరిశా రమేష్‌గౌడ్, శీలం శ్రీనివాసరావు, షాకా, వంశీ, షాలెంరాజు, వి.ధర్మేంద్రరెడ్డి, కిషోర్, శేఖర్ పాల్గొన్నారు.



జగన్ మీడియా పత్రిక ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీలకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9 వరకు కడప జిల్లా పులివెందులలో జరిగిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో బాపట్ల జిల్లా ప్రథమస్థానం కైవశం చేసుకుంది. వీరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎస్.హేమంత్, ఎస్‌కే జుబేల్‌లు అంతర్‌రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివారావు తెలిపారు. ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని సోనీపట్‌లో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు.

డాచ్‌బాల్ క్రీడలకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

బాపట్ల,నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి గోదావరి మహిమరాజు అంతర్‌రాష్ట్ర డాచ్‌బాల్ క్రీడలకు ఎంపికయ్యాడు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగబోయే అంతర్‌రాష్ట్ర డాచ్‌బాల్ క్రీడలలో పాల్గొంటారు. మహిమరాజును బుధవారం ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పీడీ కత్తి శ్రీనివాసరావు అభినందించారు.

పట్టణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు పరిశీలన

బాపట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీలో నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం 23వ వార్డు వివేకానందకాలనీ మున్సిపల్ పార్క్‌ను పరిశీలించారు. సుందరీకరణ పనుల పురోగతి గురించి డీఈ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

పీపీపీ విధానం విరమించుకునే వరకు ఉద్యమం

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



ర్యాలీగా వెళుతున్న అఖిలపక్ష నాయకులు

బాపట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం విషయంలో పీపీపీ విధానాన్ని విరమించుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ దగ్గర నుంచి గడియార స్తంభంసెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు అఖిలపక్ష నాయకులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తన్నీరు సింగరకొండ, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు, పర్రె కోటయ్య, ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, ఎరుకుల హక్కుల పోరాటసమితినాయకుడు మోహన్ కుమార్ ధర్మా, సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు, వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, నక్కా వీరారెడ్డి, కొచ్చెర వినయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

● రేపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యం అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, చదలవాడ శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, కరేటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చిన వైద్యకళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నెహ్రూబాబుకు వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వరికూటి అమృతపాణి పాల్గొన్నారు.



గృహాల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు



గృహాల మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆనందబాబు

● ప్రతి పేదవాడికి 12 మౌలిక సదుపాయాలు

● కలెక్టర్ వినోద్‌కుమార్

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చదలవాడలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా నిర్మితమైన గృహాలను బుధవారం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 1061 ఇళ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. జగన్ ఐదు సంవత్సరాల పాలనలో ఇల్లు కూడా నిర్మాణం చేయకపోగా లబ్ధిదారుల నుంచి దళారీ వ్యవస్థ ద్వారా డబ్బులు గుంజుకోవడంతో పాటు స్థలాలు కొనుగోలు విషయంలో నాయకులతో కలిసి జగన్ కోట్లాది రూపాయలు దండుకున్నారని, మెరకల పేరుతో కోట్లు తిన్నారని విమర్శించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు నిర్మాణం చేయడంతో పాటు అలాంటి వారికి 12 మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 19,285 నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, హౌసింగ్ డీఈ సీతారామయ్య, పీడీ వెంకటేశ్వరరావు, ఏఈ సునీల్, ప్రేమ్‌చంద్, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, యార్డు వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, తెలుగు రైతు నాయకుడు బండారు సూరిబాబు, టీడీపీ యువ నాయకుడు కొల్లూరు శ్రీధర్, వరహాపురం సొసైటీ అధ్యక్షుడు బొల్లిముంత నాగకుమార్, నాయకులు బొల్లిముంత కోటేశ్వరరావు, సంద్రధనుంజయరావు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్లు మంజూరు : అనగాని

రేపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో రాబోయే మూడున్నర సంవత్సరాల్లో సొంత ఇల్లు లేని వారు ఎవరూ ఉండకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి ఆవాస్‌యోజన 1.0 కార్యక్రమంలో భాగంగా నూతన గృహాల మంజూరు పత్రాలను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో భాగంగా నియోజకవర్గంలో అర్హులైన వారందరికి గృహాలు నిర్మించటం జరుగుతుందన్నారు. రేపల్లెటౌన్‌లో 134, రూరల్‌లో 400, నిజాంపట్నంలో 402, చెరుకుపల్లిలో 210, నగరంలో 240 గృహాలు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, కమిషనర్ కె.సాంబశివరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, ఛైర్‌పర్సన్ కట్టా మంగా, చెరుకుపల్లి టీడీపీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, వైస్ ఛైర్మన్ టీవీకే గుప్తా, టీడీపీ నాయకులు జీపీ రామారావు, నల్లూరు అజయ్‌కుమార్, మద్దుల అంకాలు, హౌసింగ్ అధికారులుపాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆటిజం కేంద్రం

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

● స్థల పరిశీలన చేయాలని అధికారులకు ఆదేశం

బాపట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నూతన భవనంలో ఆటిజం కేంద్రం తాత్కాలికంగా ఏర్పాటు చేయటానికి కేటాయించిన గదులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆటిజం కేంద్రాన్ని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటిజం భవనం నిర్మాణం కొరకు ప్రభుత్వం సుమారు 28లక్షల రూపాయిలు కేటాయించినట్లు తెలిపారు.

జిల్లా క్రీడల సముదాయ నిర్మాణానికి స్థల పరిశీలన

బాపట్ల మండలంలోని ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో జిల్లా క్రీడల సముదాయ నిర్మాణం కొరకు జిల్లా క్రీడల సంస్థకు అందజేసిన భూమిని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. క్రీడల సముదాయ నిర్మాణం కొరకు డీపీఆర్ తయారు చేయాలని రెవెన్యూ అధికారికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఐఇడి కోఆర్డినేటర్ జోత్స్న, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

మానసిక దివ్యాంగులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను, సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని భవితా కేంద్రంను బుధవారం కలెక్టర్ సందర్శించారు. భవిత కేంద్రంలో వారికి అందించే వైద్యసేవలు, సిబ్బంది వివరాలు, అందుబాటులో ఉన్న పరికరాలు గురించి అధికారులను ఆరాతీశారు. భవిత కేంద్రంను త్వరలో మున్సిపల్ హైస్కూల్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఎంఈవో ఎస్.నిరంజన్, ఐఇడి కోఆర్డినేటర్ జోత్స్న పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో మానసికదివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రభుత్వ ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేయాలి

జిల్లాలో ప్రభుత్వ మంజూరు చేసిన ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రహదారుల అభివృద్ధి, పర్యాటక శాఖ స్వదేశీ దర్శన్, నిజాంపట్నం షిప్పింగ్ హార్బర్, ఆక్వాపార్క్ తదితర అంశాలపై కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓడరేవు నుంచి పిడుగురాళ్ళ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. గుంటూరు నుండి నిజాంపట్నం వరకు రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో స్వదేశీదర్శన్ పథకం కింద సూర్యలంకబీచ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.97 కోట్లతో పనులు చేపట్టాలని చెప్పారు. సూర్యలంక వద్ద పేరలిడ్రైన్ అభివృద్ధి చేయటానికి అనుమతులు మంజూరు చేయాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు. నిజాంపట్నం హార్బర్ పనులు సజావుగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిజాంపట్నంలో సమగ్ర ఆక్వాపార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ గాలి దేవుడు, ఆర్‌అండ్‌బి డీఈఈ శ్రీనివాసరావు, పర్యాటక శాఖ డీఈఈ కుమార్, జిల్లా హాస్పటల్స్ కోఆర్డినేటర్ పద్మావతి పాల్గొన్నారు.

సైనిక వెల్ఫేర్ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కర్లపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చీరాల నాగేంద్రరెడ్డి కుమారుడు శశి కిరణ్‌రెడ్డి 90 శాతం అంగవైకల్యంతో ఇంటికి పరిమితమయ్యారు. రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు గుంటూరు జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారిణి గుణశీలాకు విషయాన్ని తెలియజేయగా బుధవారం ఆమె తన సిబ్బందితో సహా వచ్చి పత్రాలను పరిశీలించి తగు ఆర్థిక సహాయం ప్రతినెల రూ.2500 వచ్చేవిధంగా చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసు సూపరింటెండెంట్ ఆనందరావు, సుబ్రహ్మణ్యం, రాజీవ్, ఏపీఆర్ఎంఎస్ఎస్ఎస్ రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరిరావు, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారావు, మాజీ సైనికులు డి.వెంకటేశ్వర్లు, ఎంకె రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఖాజీపాలెం విద్యార్థి ఎంపిక

పిట్టలవానిపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బారాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మౌర్యుడు రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగిన అండర్-14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.భూపతిరావు బుధవారం తెలిపారు. ఈనెలాఖరులో నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కరీముల్లా అన్నారు.

శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన

బాపట్లరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యులు బుధవారం బాపట్ల మండల అప్పికట్ల గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రూరల్ ఎస్ఐ ఎం.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.సుధారాణి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం

చెరుకుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు నడింపల్లిలోని పాంచాలవరం, గోవాడ డొంకలు పెద్ద గాడులు పడటంతో రైతులు పొలాలకు వెళ్ళిరావడం చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ విషయమై అధికారులకు తెలిపినప్పటికి ఏవిధమైన స్పందన లేదని రైతులు ఆరోపించారు. స్వచ్ఛందంగా ట్రాక్టర్లతో పాంచాలవరం, గోవాడ డొంకలను దున్ని చదును చేసుకున్నామని తెలిపారు.

కాంపిటేటివ్ ఎగ్జామ్‌కు చెరుకుపల్లి విద్యార్థుల ఎంపిక

చెరుకుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలస్థాయిలో ఈనెల 3, 4, 5 తేదీలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎగ్జామ్స్‌లో చెరుకుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి కౌశల్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ఎంపికయ్యారు. ఈనెల 27న 8, 9వ తరగతి విద్యార్థులకు, 28న పది విద్యార్థులకు బాపట్లలో ఈ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు.

స్వామి లక్ష్మణానంద సరస్వతికి నివాళులు

కొల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్వామి లక్ష్మణానంద సరస్వతికి సమరసత సేవా ఫౌండేషన్ ఘన నివాళులర్పించింది. బుధవారం కొల్లూరులో ధర్మరక్షా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత చాందస్సుల చేతుల్లో హత్యకు గురైన స్వామి లక్ష్మణానంద సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ధర్మ విస్తారక్ రాముడు, తమ్మన సాంబశివరావు, కె.అన్నపూర్ణ, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలతో పవిత్రత

నగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల ధరించడం ద్వారా ఓ పవిత్రత సంతరిస్తుందని, మంచి నడవడిక కూడా ఏర్పడుతుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరం శ్రీగిరిపురంలోని వేంకటేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం నిర్వహించిన అయ్యప్పపడిపూజలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సురేష్, తాతా ఏడుకొండలు, శ్రీకాంత్, యరగళ్ళ తేజ, గురుస్వామి, మోర్ల శ్రీనివాసరావు, గురుస్వామి శ్రీను, అయ్యప్పలు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

చెరుకుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశుగణాభివృద్ధి శాఖ, పశుసంవర్థక శాఖల సహకారంతో రాజవోలులో బుధవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ తాతా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తుళ్ళూరి శివవెంకట రామారావు ప్రారంభించారు. 72 పశువులకు పరీక్షలు జరిపి అవసరమైన మందులు పంపిణీ చేశామని గూడవల్లి పశువైద్యాధికారిణి బొలగాని జ్యోత్స్న తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.రంజిత, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బట్టుస్వామి, ఖజా నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, గూడవల్లి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిర్సాముండా 151వ జయంతోత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బిర్సాముండా 151వ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూరేపల్లిలో విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాలలో బిర్సా ముండా ఉత్సవాలలో భాగంగా బుధవారం మోర్ల గౌతమ్ అనే విద్యార్థి ఆయన వేషధారణలో చేసిన ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు సంప్రదాయ గిరిజన నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీనివాసశర్మ, ఉపాధ్యాయులు శ్యామకుమారి, పి.శివనాగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదవులు పొందిన వారు నిబద్ధతతో పని చేయాలి

● ప్రమాణ స్వీకార సభలో ఎమ్మెల్యే ఆనందబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పార్టీలో పదవులు పొందిన వారు నిబద్ధతతో పని చేయాలని పార్టీ పటిష్టతకు మరింతగా కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లుగా ఎంపికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. సభకు బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, పదవి పొందిన వాళ్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పి ఎన్నో ఆశలతో కూడిన పాలనకు స్వాగతం పలికారని ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. నాయకులు, అధికారులు అవినీతికి పూర్తిగా అలవాటు పడ్డారని ప్రస్తుత పరిస్థితుల్లో కూడా కొందరు అధికారులు అదే బాటలో నడుస్తున్న విషయం తనకు తెలుసునని, అవినీతిని అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యుల చేత స్వయంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, పార్టీ నాయకులు శివారెడ్డి, మండల అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, మైనేని మురళీకృష్ణ, యార్డు వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, షేక్ హనీఫ్, బట్టు మల్లిఖార్జునరావు, రవిప్రసాద్, దొప్పలపూడి సుధాకర్, వివిధ విభాగాల పార్టీ శ్రేణులు, ఐదు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళ విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

రేపు ప్రజా గ్రీవెన్స్

అమృతలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు తెలుపుకునేందుకు శుక్రవారం ప్రజా గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపారు. అమృతలూరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి ఈ గ్రీవెన్స్ జరుగుతుందని, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దు : ఏఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ.భాస్కరరావు

రేపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి ఎవరూ పాల్పడవద్దని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ.భాస్కరరావు అన్నారు. రేపల్లె మండలంలోని బాపట్ల సూపరింటెండెంట్ ఇంజనీర్ జీ.ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ నిర్వహించారు. మండలంలో 120 మంది సిబ్బంది పాల్గొని 4,946 సర్వీస్‌లు తనిఖీ చేయటం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో 53 మంది వినియోగదారులు అధిక లోడు వాడుతున్నట్లు గుర్తించారు. 4.04 లక్షల రూపాయలు జరిమానా విధించామని తెలిపారు. ఒక వ్యక్తి దొంగతనంగా విద్యుత్ వాడకాన్ని గుర్తించామని, అతనికి వెయ్యి రూపాయల జరిమానా విధించామన్నారు. కేటగిరి మార్పు నాలుగు సర్వీస్‌లను గుర్తించి రూ.19 వేలు జరిమానా విధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ శ్యామ్‌సుధాకర్‌బాబు, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

లాంగ్ జంప్ పోటీలకు జంపని విద్యార్థిని ఎంపిక

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు వేమూరు మండలం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తేజస్విని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బదరి నారాయణ పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో ఎంపికైన విద్యార్థినిని బుధవారం పాఠశాలలో ఎస్ఎంసీ ఛైర్మన్ విజయబాబు మెమోంటో అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు, అధ్యాపకులు భాగ్యమ్మ, మధుమయి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

భట్టిప్రోలులో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భట్టిప్రోలులోని టిఎం రావు ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా చేతబూని విద్యార్థులు గీతాలాపన చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ సుగుణకుమారి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, మహ్మద్ అనుల్‌హక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊర చెరువులో చేపల పెంపకానికి వేలం

వేమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వరహాపురం గ్రామ పరిధిలో ఉన్న ఊర చెరువులో చేపలు పెంచుకునే హక్కుకు బహిరంగ వేలం బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్ యల్లమాటి స్వాతి, పంచాయతీ కార్యదర్శి స్టాలిన్, వీఆర్వో కోటేశ్వరరావు, వార్డు మెంబరు, గ్రామ పెద్దల సమక్షంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.


స్ఫూర్తినిస్తున్న పునరుద్ధరణ

- అద్భుతంగా వెంగళాయపాలెం చెరువు సుందరీకరణ
- రూ.1.20 కోట్ల నిధులతో 15 రోజుల్లో పూర్తి
- సుస్థిరమైన విధానాలతో చెరువు నిర్వహణ
- పర్యాటక ప్రదేశంగా చేసేందుకు పుష్కల అవకాశాలు


వెంగళాయపాలెం చెరువు గట్టున పునరుద్ధరించిన బావి


చెరువు గట్టున పిల్లల ఆటస్థలం


అన్ని వయస్సుల వారికి ఆరోగ్యాన్ని పంచేందుకు నిర్మించిన వాకింగ్ ట్రాక్



గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 150 ఏళ్ల చరిత్ర కలిగిన వెంగళాయపాలెం చెరువును పునరుద్ధరించిన విధానం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా స్ఫూర్తిని నింపుతోంది. ఉప్పునీటితో నిండి ఒక పాడుబడిన చెరువుగా మారిపోయిన ఈ జల ప్రదాయినిని కేవలం 15 రోజుల వ్యవధిలోనే సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయడం, అందులో నీటిని నింపడం, పూడకుపోయిన బావి లోతు పెంచడం ద్వారా ఇప్పుడు ఈ చెరువు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందుకు ఖర్చు చేసింది కూడా రూ. 1.20 కోట్లు మాత్రమే. అన్నింటి కంటే ముఖ్యం దీనిని భవిష్యత్తులో పాడుబడకుండా నిర్వహించేందుకు ఆదాయం వచ్చే వనరులను కూడా ఏర్పాటు చేయడం. ఈ చెరువు ద్వారా పంట పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీరు అందించొచ్చు. అలానే బోర్‌వెల్స్‌, బావులు రీఛార్జ్ కావడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

● 150 ఏళ్ల క్రితం నిర్మాణం

గుంటూరు నగరానికి ఏడు, ఎనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న వెంగళాయపాలెంలో ప్రజలు వ్యవసాయం, పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ పత్తి, మిర్చి, పొగాకు, కూరగాయలు, ఆకుకూరులు పండుతాయి. 21 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును 150 ఏళ్ల క్రితం నిర్మించారు. దీనిని వ్యవసాయ, పశువుల అవసరాలకే వినియోగించేవారు. అయితే 1990లలో గ్రామస్థులు చెరువు గట్టున ఒక బావిని నిర్మించి స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు. నిర్వహణ లోపం, భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో చెరువుగట్లు దెబ్బతిన్నాయి. అలానే దీనికి వచ్చే వాగునీరు నిలిచిపోయింది. దీంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇక్కడ ఉండే పక్షులు కూడా వలస వెళ్లిపోయాయి. చెరువులో నీరు అడుగంటడం వల్ల పశువుల సంఖ్యను కూడా గ్రామస్థులు తగ్గించుకున్నారు. బావి కూడ పూడకుపోయింది. ఈ నీటి వనరుని ఎలాగైనా పునరుద్ధరించాలన్న సంకల్పంతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గ్రామ కమిటీ సంకల్పించింది. కొండవాగు నుంచి ఏర్పాటైన ఫీడర్ చానల్స్‌లో పూడిక తొలగించడంతో ఇప్పుడు చెరువులోకి స్వచ్ఛమైన నీరు వచ్చి చేరుతోంది. ఒక వేళ అదనంగా చెరువులోకి నీరు వచ్చినా ఆ నీటిని మళ్లించేందుకు 7.20 మీటర్ల పొడవునా కాలువను నిర్మించారు. చెరువు గట్లను బలోపేతం చేశారు. కొండరాళ్లతో రివిట్‌మెంట్ చేశారు. అలానే చెరువును రెండు భాగాలుగా విభజిస్తూ మధ్యలో ఒక గట్టును నిర్మించారు. ఒకదానిని పశువలకు తాగునీటి కోసం, మరొకటి పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్ ఫీడర్ ఛానల్ నుంచి కూడా నీరు వచ్చే ఏర్పాటును అధికారులు చేశారు. ఈ చెరువులో 1.20 లక్షల క్యూబిక్‌మీటర్ల నీటిని ఒడిసి పట్టుకోవచ్చు.

● 15 శాతం పెరగనున్న రైతు ఆదాయం

చెరువుపై ఆధారపడి 102 ఎకరాల్లో వరి సాగు చేయొచ్చు. భూమిలో తేమ శాతం పెరగడం వలన 1066 ఎకరాల్లో రెండు పంటలను ఈ రబీ సీజన్ నుంచే పండించొచ్చు. దీని వల్ల రైతు ఆదాయం 15 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 70 అడుగుల్లోనే భూగర్భ జలం అందుబాటులోకి తీసుకురావడం వల్ల రైతులు కొత్తగా 58 బోర్‌వెల్స్ నిర్మాణానికి దరఖాస్తు చేసుకొన్నారు. ఉప్పునీటి శాతం తగ్గడం వల్ల ఐదు పబ్లిక్ బోర్‌వెల్స్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఈ చెరువు వల్ల 103 ఎకరాల్లో మాగాణి, 102 ఎకరాల్లో వరి, 120 ఎకరాల్లో పశుగ్రాసం, 1066 ఎకరాల్లో మెట్ట, 262 ఎకరాల్లో ప్రత్తి, 20 ఎకరాల్లో శనగ పంటకు నీరు అందుతుంది. పూల మొక్కలు మళ్లీ జీవం పోసుకొంటున్నాయి. అలానే వలస పక్షులు వెనక్కు వస్తాయని భావిస్తున్నారు.

● ప్రతి ఏటా రూ.4.12 లక్షల ఆదాయం

ప్రజలను ఈ చెరువుతో భాగాస్వామ్యం చేసి నిత్యం సందర్శించేలా చేసేందుకు వాకింగ్ ట్రాక్, నక్షత్రవనం, పిల్లల ఆటస్థలం, సైన్స్ పార్కు, ఓపెన్ ఎయిర్ జిమ్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం (సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం) ఏర్పాటు చేశారు. చెరువు నిర్వహణ కోసం ఐదు ఎకరాల్లో 212 కొబ్బరి చెట్లను నాటారు. ఇవి ఆరో సంవత్సరం నుంచి ఫలసాయాన్ని ఇస్తాయి. దీని వల్ల ఏటా రూ. 4.12 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. చేపల వల్ల కూడా ఆదాయం పెరుగుతుంది. బోటింగ్, ఇతర ఆహ్లాదం పంచేవి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు నిర్ణయించారు. దీంతో ఇదొక పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లతో ఆహ్లాద వాతావరణం

● పంజాబ్ ప్రభుత్వం సెక్రటరీ పరిమిందర్ సింగ్ పాల్


వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ పరిమిందర్ సింగ్ పాల్, ఇతర అధికారులు, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు విస్తరిస్తున్న నగరాల్లో చెత్త డంపింగ్ యార్డ్‌లు లేకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు దోహదపడతాయని పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరి పరిమిందర్ సింగ్ పాల్ అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం పంజాబ్ నుంచి స్పెషల్ సెక్రటరి పర్మీందర్ పాల్ సింగ్, పగ్వారా కార్పొరేషన్ కమిషనర్ అక్షిత గుప్తా, పీఎంఐడీసీ సీనియర్ మేనేజర్ సిమర్జీత్ కౌర్, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏపీ మున్సిపాల్టీల నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది, ఉత్పత్తి అయిన విద్యుత్ వినియోగం, విక్రయాలు, వ్యర్థాల నుండి వచ్చే బూడిద నిర్వహణ, పర్యావరణ అంశాలు, ప్లాంట్ ఏర్పాటుకు పెట్టుబడి తదితర వివరాలను జిందాల్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, జిందాల్ ప్లాంట్ నిర్వహణలో వ్యర్థాల తరలింపునకు గుంటూరు నగరపాలక సంస్థ నోడల్ కార్పొరేషన్‌గా ఉండి, ప్రతి రోజు షుమారు 4 వందల టన్నుల వ్యర్థాలను పంపుతున్నామన్నారు. .అనంతరం పంజాబ్ అధికారుల బృందం జిందాల్ ప్లాంట్‌లోని టిప్పింగ్ ఫ్లోర్, గ్రాప్ కంట్రోల్ రూమ్, బాయిలర్స్, ఫ్లూ గ్యాస్ క్లీనింగ్ సిస్టం, సిబ్బంది, డీసీఎస్ కంట్రోల్ రూమ్‌లు, వాటి పనితీరును అడిగి తెలుసుకొని, ప్లాంట్ కెపాసిటీ, ప్రస్తుతం వస్తున్న వ్యర్థాలు, పంపుతున్న మునిసిపాలిటీలు, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సమగ్ర వివరాల డాక్యుమెంట్ అందించాలని కోరారు. పర్యటనలో జీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి.శాంతికళ, జిందాల్ ప్లాంట్ ఏపీ ప్రెసిడెంట్ ఎంవీ చారి బృందం పాల్గొన్నారు.

రాజధానిలో కొత్తగా భూకేటాయింపులకు అనుమతి

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు, వివిధ సంస్థలు స్థాపించేందుకు భూకేటాయింపులు చేయాలని అందిన దరఖాస్తులను పరిశీలించి మంత్రుల బృందం చేసిన సిఫార్సుల మేరకు మునిసిపల్ పరిపాలన (సీఆర్‌డీఏ) శాఖ అనుమతులు మంజూరుచేసింది. ఈ నెల 8న మంత్రుల బృందం సమావేశమై చర్చించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. వాటి ఆధారంగా కొత్తగా 11 సంస్థలకు 49.50 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాసిల్-వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఐనవోలు, మందడం సర్వే నంబర్లలో) ఏర్పాటుకు 4 ఎకరాలు ఎకరం రూ.50లక్షలకు, శాంక్టామరియా ఇంటర్నే షనల్ స్కూల్ స్థాపించేందుకు 8 ఎకరాలు తుళ్లూరులో ఎకరం రూ.50లక్షలకు, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటుకు 15 ఎకరాలు నవులూరులో 60 సంవత్సరాల లీజుకు చదరపు భూమి రూ.1కి, ఎకరానికి రూ.4.1కోట్ల ప్రీమియం, కాగ్ రెసిడెన్షియల్‌ని 5 ఎకరాల్లో ఐనవోలులో నిర్మించేందుకు 4.1 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమి, ఎన్‌టీపీసీని రాయపూడిలో 1.50 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు, రూ.4.1కోట్ల ప్రీమియం ఎకరానికి, జ్యుడీషియల్ అకాడమిని పిచ్చుకలపాలెంలో 4.83 ఎకరాల్లో ఏర్పాటుకు 60 ఏళ్లపాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు, కాస్మోస్ 2-ప్లానిటోరియం(ఐఐఏ) ని ఐదు ఎకరాల్లో అనంతవరంలో ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు కేటాయించారు. ఉద్ధండ్రాయునిపాలెంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు 0.40 ఎకరాలు, పంజాబ్ నేషనల్ బ్యాంకు 0.40 ఎకరాలు, ఐడీబీఐ బ్యాంకు లిమిటెడ్ 0.40 ఎకరాలను ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ.1కి లీజుకు, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియం, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ)ని 5 ఎకరాల్లో తుళ్లూరులో ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపుమీటరు రూ.1కి లీజుకు, ప్రీమియం రూ.4.1 కోట్లను ఎకరానికి కేటాయించింది. గతంలో భూ కేటాయిం పులు చేసిన కొన్ని సంస్థలకు సవరణలు చేసింది. హైదరా బాద్ ఎడ్యుకేషనల్ అకాడమి(ఇండస్ ఇంటర్నేషనల్ స్కూ ల్స్)కి తుళ్లూరులో 8 ఎకరాలు ఎకరం రూ.50లక్షలకు, బీపీసీఎల్ ఆఫీసు నిడమర్రులో 1.34 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి వెలగపూడిలో 2 ఎకరాలు, ఏపీహెచ్‌ఆర్‌డీఐకి శాఖమూ రులో 10 ఎకరాలు 60 ఏళ్ల పాటు లీజుకు చదరపు మీటర్ రూ.1కి, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియం, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐకి ఐనవోలులో 61.79 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలకు. హడ్కోకి 9.17 ఎకరాలను ఎకరం రూ.4 కోట్లకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

● సిబ్బంది నివాసాల కోసం

ఇదే విధంగా బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలు అధికారులు, సిబ్బంది నివాసాల కోసం ఐనవోలులో ఏపీసీవోబీ 2.60 ఎకరాలు, ఎస్‌బీఐ 2.05 ఎకరాలు, ఆర్‌బీఐ 4.04 ఎకరాలు, బ్యాంక్ ఆఫ్ బరోడ 1.15 ఎకరాలు, కెనరా బ్యాంకు 0.80 ఎకరాలు, బ్యాంకు ఆఫ్ ఇండియా 0.82 ఎకరాలు, బీపీసీఎల్ 1.10 ఎకరాలు, ఎన్‌ఐఏసీఎల్ 0.50 ఎకరాల భూమిని 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ. 1కి, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియంతో మంజూరు చేసింది. అమరావతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అకాడమికి నెక్కల్లులో 3 ఎకరాల భూమిని ఎకరం రూ.50 లక్షలకు, ఎఫ్‌సీఐకి నేలపాడులో 0.50 ఎకరాలు, ఐనవోలులో 0.60 ఎకరాల భూమిని ఎకరం రూ.4 కోట్లకు, కాంధారి హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు తుళ్లూరులో ఎకరం రూ.1.50 కోట్లకు, కిన్నెర గ్రూపు ఆఫ్ హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు మందడంలో ఎకరం రూ.1.50 కోట్లకు, ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ డిపార్టుమెంట్‌కి 6.19 ఎకరాల భూమిని 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ.1కి, గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి శాకమూరులో నాలుగు ఎకరాలు ఎకరం రూ.50 లక్షలకు కేటాయింపులు చేసింది.

మొబైల్ యాప్‌తోనే..

● కపాస్ కిసాన్ యాప్‌తో సీసీఐ కొనుగోళ్లు



పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని నిబంధనలతో రైతులు ఇకపై సీసీఐ కేంద్రాలకు నేరుగా పత్తిని తీసుకెళ్లి అమ్మే వీలు లేకుండా పోయింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు ముందుగా స్లాట్‌ను బుక్ చేసుకొని అధికారులు చెప్పిన తేదీ, సమయానికి పత్తిని తీసుకెళ్లి విక్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు కాస్త చైతన్యవంతులై మొబైల్ యాప్‌ను ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి.

● ఇలా స్లాట్ బుక్ చేసుకోవాలి

ప్రతి రైతు తమ మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబరుకొచ్చిన ఓటిపి ద్వారా లాగిన్ అవ్వాలి. ఆ తరువాత ఎక్కడెక్కడ సీసీఐ కొనుగోలు కేంద్రాలున్నాయో చూసుకోవాలి. అనంతరం తమకు దగ్గరలోని కేంద్రంలో పత్తిని అమ్మేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు తమకు కేటాయించిన తేదీ, సమయంలో సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకెళ్లి విక్రయించుకోవాల్సి ఉంటుంది.

● జిల్లాలో 11 సీసీఐ కేంద్రాల ఏర్పాటు

పల్నాడు జిల్లాలో మొత్తం 11 సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గురజాల నియోజకవర్గం పరిధిలో పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, గురజాల, నరసరావుపేట పరిధిలో మూడు, క్రోసూరు, చిలకలూరిపేట పరిధిలో రెండు, మాచర్లలో ఒకటి, మరో ప్రాంతంలో ఒక సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

● మద్దతు ధర రూ.8,110

కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు పత్తికి క్వింటాల్‌కు ధర రూ.8,110గా నిర్ణయించింది. పత్తిలో తేమ 8 శాతం ఉంటే రూ.8,110, 9శాతం ఉంటే రూ.8,028.90, 10శాతం ఉంటే రూ.7,947.80, 11శాతం ఉంటే రూ.7,866.70, 12శాతం ఉంటే రూ. 7,758.60 చొప్పున మద్దతు ధరను ప్రకటించారు. తేమ శాతం 8 నుంచి 12 శాతంలోపే ఉండాలని పేర్కొన్నారు.

పేకాట పోలీసులపై సస్పెన్షన్ వేటు

- పట్టుబడిన వెంటనే ప్రాథమిక విచారణ... బదిలీ
- సమగ్ర విచారణ అనంతరం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- సత్తెనపల్లి కానిస్టేబుల్‌పై పల్నాడు ఎస్పీకి నివేదిక
- గాడి తప్పితే సహించేది లేదంటూ హెచ్చరిక

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేకాటాడుతూ పట్టుబడిన పోలీసులపై సస్పెన్షన్ వేటుపడింది. ఇటీవల పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోటల్లో మద్యం సేవిస్తూ, పేకాడుతూ పట్టుబడిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గాడితప్పి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదంటూ ఎస్పీ హెచ్చరించారు. మూడు రోజుల క్రితం పెదకాకాని సమీపంలోని జాతీయ రహదారి పక్కన హోటల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆ హోటల్‌పై దాడి చేయగా నలుగురు పోలీసులు, ముగ్గురు ప్రైవేటువ్యక్తులు చిక్కారు. అందులో పెదకాకాని ఏఎస్సై కె.వెంకటరావు, ఈస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాధాకృష్ణ, తుళ్ళూరు హెడ్ కానిస్టేబుల్ ఆర్ రాజేంద్రప్రసాద్, పల్నాడు జిల్లాకు చెందిన వీరబాబు, మరో ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఉన్నారు. వెంటనే టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంబంధిత సీఐకు ఫోన్ చేశారు. అయితే ఆ సమయంలో ఆయన ఎస్పీ వద్ద సమావేశంలో ఉండడంతో ఫోను మాట్లాడలేక పోయారు. దీంతో సిబ్బంది మరో సీఐకు ఫోన్ చేయగా ఆయన వారు మద్యం సేవిస్తున్నట్లుగా భావించి వదిలేయాలని సూచించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని వదిలేసి వెనక్కి వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎస్పీ సమావేశం నుంచి బయటికి వచ్చిన సంబంధిత సీఐ తన ఫోన్‌లో మిస్డ్‌కాల్ చూసి టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఫోన్ చేశారు. హోటల్లో మద్యంసేవిస్తూ, పేకాడుతూ పట్టుబడిన విషయం ఆయనకు చెప్పగా వెంటనే వారిని పెదకాకాని పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని సూచించారు. అయితే అప్పటికే మరో సిఐ సూచన మేరకు వదిలేసి వచ్చేశామని చెప్పడంతో ఆయన విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా అదే రోజు వారిని బదిలీ చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో ఉన్న ముగ్గురు పోలీసులపై బదిలీ వేటువేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణలో వారు పేకాట ఆడుతూ పట్టుబడిన విషయం వాస్తవమేనని తేలింది. సంబంధిత ఏఎస్ఐ గతంలోనూ పేకాట ఆడిస్తున్నట్లు ఆరోపణలు ఉండడంతో ఈ వ్యవహారంపై ఎస్పీ వకుల్ జిందాల్ సీరియస్‌గా స్పందించారు. పెదకాకాని ఏఎస్ఐ కె.వెంకట్రావు, ఈస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాధాకృష్ణ, తుళ్లూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్ రాజేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఈ ఘటనలో పట్టుబడిన పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కానిస్టేబుల్ వీరబాబుపై చర్యలకు సిఫారసు చేస్తూ పల్నాడు ఎస్పీకి నివేదిక పంపారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, సిబ్బంది చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనడం లేదా వాటికి సహకరించడం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అలాంటి వారికి శాకాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఇటీవలే ఎస్సై సహా నలుగురిపై వేటు

ఇదే తరహాలో ఇటీవల జిల్లాలో గాడితప్పిన ఖాకీలపై ఎస్పీ వకుల్ జిందాల్ కన్నెర్ర చేశారు. జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ప్రైవేటు పంచాయతీలు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ స్టేషన్లో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించారు. తొలుత ఆరోపణలు ఎదుర్కొన్న నగరంపాలెం, పెదకాకాని పోలీస్ స్టేషన్లలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణ నివేదికల ఆధారంగా ఈ నెల 6న నగరంపాలెం ఎస్సై సలాం, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, అలాగే ఉద్యోగం నుంచి డిస్మిస్ అయి పోలీసుగా చలామణి అవుతున్న గఫార్, పోలీసు శాఖతో సంబంధం లేని ప్రైవేటు డ్రైవర్ డానియేల్, పెదకాకాని స్టేషన్ కానిస్టేబుల్ బి.సురేశ్ కుమార్, హోంగార్డు హరీశ్‌పై కొరడా ఝుళిపించి ఖాకీలకు హెచ్చరికలు పంపారు.

కిట్స్ అధినేత కోయ సుబ్బారావుకు డాక్టరేట్


కోయ సుబ్బారావు

గుంటూరు (విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావుకు మలేసియా, అమెరికాకు చెందిన మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా స్థానిక చంద్రమౌళి నగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో కోయ సుబ్బారావును ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు బుధవారం సత్కరించారు. కోయ సుబ్బారావు మూడు దశాబ్దాలుగా సాంకేతిక విద్యారంగంలో ఉంటూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా సంస్థలను నిర్వహిస్తున్నారని వక్తలు హర్షం వ్యక్తం చేశారు.అత్యవసర సమయాల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఆయన చేపట్టారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా కోయ సుబ్బారావును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాల కృష్ణ, మలినేని గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్, జేకేసీ షటిల్ ఫ్రెండ్స్, జీఎస్ఆర్ స్కూల్ అధినేత జి.సాంబశివరావు, కిట్స్ కళాశాల డైరెక్టర డాక్టర్ కె.హరిబాబు, అధ్యాపకులు తదితరులు సత్కరించారు.

ఎంఎస్ఎంఈలకు యూనియన్ బ్యాంకు చేయూత



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులకు రూ. 20 కోట్ల రుణపత్రాలు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్, డిప్యూటీ రీజినల్ హెడ్ అస్వర్త నాయక్ తదితరులు

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం యూనియన్ బ్యాంకు చేయూతనందిస్తుందని రీజనల్ హెడ్ ఎస్.జవహర్ అన్నారు. గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంఎస్ఎంఈ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ, అర్హులైన వ్యాపారులకు రూ.20 కోట్ల రుణ పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల యజమానులతో యూనియన్ బ్యాంకు అనుబంధాన్ని బలోపేతం చేయడంతో పాటు, కేంద్రీకృత ఆర్థిక పథకాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు

● రూ. 20 కోట్ల రుణ పత్రాలు అందజేత

తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ అస్వర్త నాయక్, ఎంఎస్ఎంఈ పాయింట్ హెడ్స్ సత్యజిత్ కబి, హరే రామ్ షా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అంతస్తుల క్రమబద్ధీకరణ

(5వ పేజీ తరువాయి)

వర్తిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భవనాలకు వర్తించదు. దరఖాస్తుతో పాటు ఈసీ, భవనం ఫొటోలు, ఇండెంటి బాండ్ తదితర పత్రాలు జత పరచాల్సి ఉంది. రూ.10 వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. భవనాలకు బిల్టప్ ఏరియా ప్లస్ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం అపరాధ రుసం విధిస్తారు.

జరిమానాలు ఇలా..

నిషేధిత స్థలాల్లో నిర్మించిన భవనాలకు బీసీఎప్ వర్తించదు. 50 చదరపు మీటర్లలోపు ఉన్న రెండు అంతస్తుల భవనాలను క్రమబద్ధీకరణ నుంచి ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. భవననిర్మాణ అనుమతి రుసుం, అభివృద్ధి చార్జీలు విధిస్తారు. ప్లాన్ తీసుకుని అంతకు మించి నిర్మించిన ఫ్లోర్లకు జరిమానా విధిస్తారు. అపార్ట్‌మెంట్లలో ప్లాన్‌లేకుండా నిర్మించిన ఫ్లోర్లకు 600 అడుగుల వరకు చదరపు అడుగుకు రూ.120, 601నుంచి 1,200 అడుగుల వరకు రూ.150, 1,201నుంచి 2వేల అడుగుల వరకు రూ.180, ఆ పైబడిన నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంది. ప్లాన్ అతిక్రమించి నిర్మించిన భవనాలకు 600 చదరపు అడుగుల వరకు రూ.20వేలు, 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.40 వేలు, 1201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.60 వేలు, 2వేల అడుగులకు ఆ పైబడిన నిర్మాణానికి రూ.80 వేలు జరిమానా చెల్లించాలి.

హృద్రోగికి అరుదైన చికిత్స

● ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియాలజిస్టుల ఘనత


కేసు వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ శ్రీకాంత్, ఇన్‌సెట్‌లో కోలుకున్న యేసయ్య



గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియాలజీ వైద్యులు అరుదైన గుండె చికిత్స నిర్వహించారు. బైపాస్ సర్జరీ చేసేందుకు వీలులేని హైరిస్క్ రోగికి, వినూత్నంగా డీకే క్రష్ టెక్నిక్‌లో రెండు స్టెంట్లను విజయవంతంగా అమర్చారు. ఈ చికిత్స అనంతరం రోగి గుండెకు రక్త సరఫరా మెరుగుపడింది. బుధవారం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో విలేకరులకు ఈ కేసు వివరాలను కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ శ్రీకాంత్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా గోగులపల్లికి చెందిన యేసయ్య గత నెల 19న తీవ్రమైన గుండె నొప్పితో వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. గుండెకు 90 శాతం రక్తం పంపింగ్ చేసే బృద్ధమనిలోని ఎడమ రక్తనాళంలో పూడికలు ఉన్నట్లు గుర్తించాం. అతడి ఆరోగ్య రీత్యా ఆపరేషన్ చేసేందుకు వైద్యులు సంశయించారు. రోగి కూడా ప్రాణభయంతో శస్త్ర చికిత్స వద్దని కోరాడు. ఈ నేపథ్యంలో నవంబరు మూడో తేదీన యేసయ్యకు యాంజియోప్లాస్టీ చేసి స్టెంట్లు అమర్చారు. బైఫర్కేషన్ ఆపరేషన్లలో సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు వైద్యులు డబుల్ కిస్ క్రష్ టెక్నిక్‌ను వినియోగించారు. గుండె రక్తనాళం బైఫర్కేషన్ (రెండుగా విడిపోయే చోట) పూడికలను పరిష్కరించేందుకు ఈ టెక్నిక్‌ను ఉపయోగిస్తారు. మొదట ఒక స్టెంట్‌ను అమర్చిన తర్వాత బెలూన్‌ను స్టెంట్‌లో పెట్టి దాన్ని గాలితో నింపి రక్తనాళాల గోడలకు సరిపోయేలా నొక్కుతారు. రక్తనాళం వంపు తిరిగిన భాగంలో స్టెంట్ సరిగ్గా అమర్చేందుకు బెలూన్‌తో ఈ విధంగా కిస్సింగ్ చేస్తారు. తర్వాత మరొక స్టెంట్‌ను అమర్చి ఇదే రీతిలో మరోసారి కిస్సింగ్ చేశారు. దీనినే డబుల్ కిస్సింగ్ క్రష్ టెక్నిక్‌గా పిలుస్తారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రస్తుతం యేసయ్య ఆరోగ్యపరంగా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఈ వైద్యచికిత్సకు రూ.7 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. సమావేశంలో కార్డియాలజిస్టులు రాజేంద్ర బేతం, బుచ్చిబాబు, పాటిబండ్ల శివాజీ, శివశంకర్ పాల్గొన్నారు. అరుదైన వైద్యచికిత్స చేసిన కార్డియాలజీ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు.

నేడు టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

బల్లికురవ, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల తెలుగుదేశం పార్టీ కమిటీ, అన్ని గ్రామాల కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం గురువారం ఉదయం బల్లికురవ పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు బల్లికురవలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ సుబ్బారావు తెలిపారు. బల్లికురవ, కొత్తపాలెం గ్రామాల వినియెగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎ. మోహన లక్ష్మినరసింహాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పొతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యలకు నివాళులు, 17న కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, క్రీడల పోటీలు, 19న మహిళా దినోత్సవం, మహిళలకు వివధ పోటీలు, రంగవల్లి, అల్లికలు, 20న అక్షరాస్యత దినోత్సవం, వారోత్సవాల ముగింపు కార్యక్రమం, బహుమతి ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు వివరించారు.

సంతమాగులూరులో...

సంతమాగులూరు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరులో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకుజాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు బాదం విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, కార్యక్రమాలు నిర్వహించి ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

14న కార్తీక వనభోజనాలు

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో చిట్టాబత్తినవారి రేణుకమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 14న కార్తికమాసం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటి ప్రతినిధి చిట్టాబత్తిన శేషారావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై శిక్షణ

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన సర్పంచ్‌లు, ఉప్పసర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులకు, 14న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు, 15న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇద్దరు వీఓఏలు, ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇస్తామని వివరించారు. రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

ఇంకొల్లు, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు,కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు తెలిపారు.ప్రతి ఒక్కరూ విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పర్చూరులో వైసీపీ ర్యాలీ

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా బుధవారం పర్చూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి బొమ్మల సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి.బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు.

నిధులు మంజూరు చేసి భూసేకరణ చేపట్టాలి

గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

లేకుంటే ఆందోళన తప్పదు

నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ కోరారు. బుధవారం పర్చూరులోని కొల్లావారి కల్యాణ మండప ప్రాంగణంలో నల్లమడ సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చానల్‌కు సంబంధించి గుంటూరు జిల్లాలో భూసేకరణకు గజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారని, భూసేకరణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని చెప్పారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరుకు పొడిగించే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించటం లేదన్నారు. ఇలా జరిగే రైతులతోపాటు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. చానల్ పొడిగింపు కోసం నల్లమడ రైతు సంఘం ఎనిమిది దశాబ్దాల నుంచి పోరాటం చేస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వ తాత్సారం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అనంతరం నల్లమడ రైతు సంఘ నాయకులు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే వేల ఎకరాలకు సాగునీటితోపాటు, ప్రజలకు తాగునీరు కూడా అందుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలు, రైతులను దృష్టిలో ఉంచుకొని ఛానల్ పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, రావి రమణయ్య చౌదరి, గడ్డిపాటి శ్రీనివాసరావు, భ్రమరాంబ, కాపు సాంబశివరావు, కొల్లా వెంకయ్యచౌదరి, నరిశెట్టి బాబు, మొవ్వా పెద్దన్న కొల్లా నాగేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహం పాల్గొన్నారు.

సోలార్ హబ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

బల్లికురవ, సంతమాగులూరు తహసీల్దార్లతో ఆర్డీవో సమీక్ష



తహసీల్దార్ కార్యాలయంలో సోలార్ హబ్ ఏర్పాటుకు భూసేకరణపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోలార్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూములను వెంటనే సేకరించే పనులు ప్రారంభించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. బుధవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయంలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన తహసీల్దార్లతో ఆర్డీవో సమీక్షించారు. మెత్తం 1800 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని, రైతులకు ఎకరాకు రూ. 18 లక్షల పరిహారం అందించేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రెండు మండలాల పరిధిలో ఉన్న ఎస్ఎల్ గుడిపాడు, కుందుర్రు, వెమిళ్లపల్లి గ్రామాలలో ఉన్న రైతులను కలిసి భూసేకరణ చేపట్టాలన్నారు. సోలార్ హబ్‌కు రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి వర్గం కూడా ఆమోదం తెలిపిందని చెప్పారు. సోలార్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు అయితే నిరుద్యోగ యువతకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. అనంతరం ఆర్డీవో భూములకు సంబంధించిన మ్యాప్‌ను తహసీల్దార్లతో సమీక్ష చేశారు. ప్రభుత్వ భూములు ఎంత ఉన్నాయి వాటిని కూడా సోలార్ హబ్‌లో తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమీక్షలో తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం వార్చితే విద్యార్థినులకు పోషకాలు ఎలా?

చిక్కీలు గడువు సమీపిస్తున్నా నిల్వ ఉంచడంపై అసహనం

బాలికల వసతి గృహాలు, రేషన్ షాపులు, సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



అద్దంకి హాస్టల్‌లో అన్నం గంజి వార్చుతుండగా ప్రశ్నిస్తున్న దేవి

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల విటమిన్‌లను విద్యార్థులకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తుంటే అన్నం వండే సమయంలో వార్చితే ఏమి ప్రయోజనం అని ఫుడ్ కమిషన్ మెంబర్ జీఎం దేవి ప్రశ్నించారు. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లయిస్ గోడౌన్, మండలంలోని చక్రాయపాలెంలో రేషన్‌షాపు, శింగరకొండ వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను, అద్దంకి పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతిగృహం, కళాశాల బాలికల వసతిగృహాలను బుధవారం దేవి ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి ఆహార నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బీసీ సంక్షేమ కళాశాల వసతిగృహంలో పోర్టిఫైడ్ రైస్‌ను వండే సమయంలో వార్చటం గమనించి ప్రశ్నించారు. వార్చటం ద్వారా పోషకాలు మొత్తం మట్టిపాలు అవుతున్నాయని, విద్యార్థినులకు ఏమి పోషకాలు అందుతాయని సిబ్బందిని ప్రశ్నించారు. అదే సమయంలో బీసీ బాలికల వసతి గృహంలో చిక్కీలు వారం రోజులలో గడువు ముగుస్తుండగా పెద్ద సంఖ్యలో నిల్వ ఉండటం గమనించి వెంటనే విద్యార్థినులకు పంపిణీ చేయాలన్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ బాషా, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రకాష్ రావు, ఏఎస్‌డబ్ల్యూవో స్వరూప, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రభావతి, ఎంఈవో శ్రీనివాసరావు, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, హెచ్ఎం బసవయ్య పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు నిరుపేదలకు పోషక ఆహారం ఇవ్వాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, నాగులపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకల బాలికల వసతి గృహంతోపాటు, పలు ప్రభుత్వ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా ఉప్పుటూరులోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంతోపాటు, గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. అదేవిధంగా మార్టూరులోని ఎస్సీ బాలికల వసతి గృహంతోపాటు, నేతాజీ నగర్‌లోని రేషన్ దుకాణాన్ని కూడా ఆమె పరిశీలించారు. నాగులపాలెం ప్రాథమిక పాఠశాల(ఎల్‌ఈ)లో భోజనం పాఠశాలలో తయారు చేయకుండా ఇంటి వద్ద నుంచే వండుకొని తెచ్చి వడ్డిస్తున్నారన్న విషయంతోపాటు గంజి వంచి తయారు చేసిన భోజనం వడ్డిస్తున్నట్లు గుర్తించిన ఆమె సంబంధిత ఉపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయురాలికి మెమో ఇవ్వాలని ఎంఈవో వెంకట్రామయ్యను ఆదేశించారు. ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా డీఎస్‌వో జమీర్‌బాషా, ఎంఈవో-2 ప్రసాద్, సీడీపీవో సుభద్ర, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

వెలిగొండ పూర్తి చేయడమే మా లక్ష్యం

ఇచ్చిన గడువులోనే ఎలా పనిచేయాలో చూడండి

ఇద్దరు వీఆర్వోలపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి నిమ్మల

సమీక్షలతో అధికారుల ఉరుకులు పరుగులు



టన్నెల్ లోపలి నీరు తోడుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

త్రిపురాంతకం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల తర్వాత మళ్లీ మంత్రి వెంటనే వస్తారని ఊహించలేదేమో కానీ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్న తీరు చూసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై బుధవారం మంత్రి నిమ్మల పరిశీలించారు. ఈనెల 7వతేదీ వచ్చిన మంత్రి నిమ్మల అధికారులకు కొన్ని సూచనలు చేసి వెళ్లారు. ముఖ్యంగా వెలిగొండ ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చే పనులు, టన్నెళ్లలోని నీటిని బయటకు తోడే పనులకు అధికారుల వద్ద నుంచే గడువు తీసుకుని వెళ్లారు. మంత్రి వస్తున్న సమాచారంతో పనులు చేసేందుకు యంత్రాలు తెచ్చి ఉంచడాన్ని ఆయన గమనించారు. అధికారులు మొద్దునిద్ర వీడాలని, గత ప్రభుత్వంలో పనిచేస్తున్నామనే భ్రమలో ఉంటే బయటకు రావాలని హెచ్చరించారు. నిర్దేశించిన లక్ష్యానికి పనులు చేయకపోతే అధికారులైనా, చివరకు నిర్వహణ బాధ్యతలు చూసే ఏజెన్సీలపైనైనా వేటు తప్పదని హెచ్చరించారు. ప్రాజెక్ట్ టన్నెళ్లలోకి వచ్చిన నీటిని తోడేందుకు కూడా ప్రణాళిక లేకపోతే ఎలా అని అన్నారు. నేను వేరే జిల్లాలో ఉండి కూడా ఇక్కడ పనుల ఫొటోలు తెప్పించుకుని చూశానని, అంటే ప్రాజెక్ట్ పట్ల ఎంత శ్రద్ధతో పనిచేస్తున్నామో గ్రహించాలన్నారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంత ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు న్యాయం జరగాలంటే వెలిగొండ పూర్తికావడంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షలో కూడా వారి నిర్లక్ష్యంపై ఆయన తీవ్రస్థాయిలో మాట్లాడారు. వరద నీరు ఎక్కువై సమీప పొలాలపైకి వచ్చి పాడైపోతే నేటికీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

వీఆర్వోలపై చర్యలు తీసుకోండి

దోర్నాల మండలంలోని ఐనముక్కల, యడవల్లి వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లారు. మొంథా తుఫాన్ సమయంలో వెలిగొండ టన్నెళ్ల నుంచి, తీగలేరు ప్రవాహానికి పలువురు రైతుల భూముల్లో పంటలు దెబ్బతిని, పొలాల్లో మట్టి మెరకలు వేసి నష్టపోయామని గతంలో వచ్చినప్పుడు చెప్పిన రైతులే ఈ రోజు కూడా వచ్చారని, కనీసం మంత్రి వచ్చిన సమయంలో సమాచారం ఇచ్చేందుకు వీఆర్వోలు అందబాటులో లేరని కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వారికి మెమో ఇచ్చి సరైన సమాధానం లేకపోతే సస్పెండ్ చేయాలని సూచించారు. అధికారులకు ఆ మాత్రం బాధ్యత లేకుంటే ఎలాఅన్నారు. తుఫాన్ పోయిన తరువాత వెంటనే పట్టణాలకు, రైతులకు విద్యుత్ ఇస్తారని, మరి రైతులకు ఎందుకు ఇంకా ఇవ్వడంలేదని అన్నారు. దోర్నాల పరిధిలో కొందరి స్తంభాలు పడిపోవడం, కొంతమంది పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయకపోవడం ఆయన దృష్టికి తీసుకురావడంపై నిమ్మల స్పందించారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులతోపాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లారు.

వ్యంగ్యాస్త్రాలు.. హెచ్చరికలు

మంత్రి నిమ్మల తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూనే అధికారులకు హెచ్చరికలు కూడా చేశారు. సమీక్షకు అధికారులు మాత్రమే ఉండాలని ప్రజలు, ప్రెస్ వద్దని బయటకు పంపుతుండగా మాది ప్రజాప్రభుత్వమని, పరదాలు, బారికేడ్లతో పాలన చేయమని అందరినీ లోపలకు ఆహ్వానించి ప్రజల మధ్యే సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ప్రజల్లో నుంచి ఒకరు ఏదో సమస్యను అడుగుతుండగా ముందు మీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేని గెలిపించే బాధ్యత తీసుకోండని సున్నితంగా చెప్పారు. ఎర్రగొండపాలెం ప్రాంతంలో అభివృద్ధి మేము చేస్తాం, ఓట్లు ఇతరులకు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అలాగే అధికారులతో మాట్లాడుతూ మనకు ఉన్న సమయం తక్కువ అని 2026లో వెలిగొండ నీళ్లు ఇవ్వానే లక్ష్యంతో పనిచేయాలని చెప్తూ దీనిని బట్టి ఇక 20-20 క్రికెట్ మ్యాచ్‌లాగా పనిచేయాలని, 50ఓవర్ల మ్యాచ్‌లాగా ఆడే ఆట కాదన్నారు. అలాగని చివరి ఓవర్లో ఆడదామని గడువు ముగిసేదాక ఆగితే అప్పుడు గెలవడం కష్టమని గుర్తించాలన్నారు. మళ్లీ నెలరోజుల వ్యవధిలోనే వస్తానని సమీక్ష సమయంలో ఎవరి పనితీరు ఏంటో ఆరోజు తెలుస్తుందని హెచ్చరించారు.

వెలిగొండ పూర్తి ధ్యేయంగా సీఎం కృషి : ఎమ్మెల్యేలు

వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం సీఎం చంద్రబాబు ఆలోచనతో ఉండి ఇలా మంత్రి ద్వారా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారని గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు ముత్తుముల అశోకరెడ్డి, కందుల నారాయణరెడ్డి అన్నారు. సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెలిగొండకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, దానిని పూర్తి చేసి ప్రారంభించే బాధ్యత ఆయనే తీసుకున్నారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పని చేయాలనే సంకల్పంతో సీఎం ఉన్నారని అన్నారు.

జాతికి అంకితం ఎలా చేశారు : ఎరిక్షన్‌బాబు

వెలిగొండ పూర్తి చేయకుండానే ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూ వైసీపీ పాలకులు జాతికి ఎలా అంకితం చేశారని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఎద్దేవా చేశారు. ఆరోజు చప్పట్లు కొట్టిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇప్పుడు వెలిగొండకు నిధులు ఇవ్వండని అడగడం చూసి ప్రజలు నవ్వుతున్నారని అన్నారు. ప్రజలకు మన ప్రభుత్వంపై నమ్మకం ఉందని, ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతుందనే విశ్వాసంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీఈ శ్యాం ప్రసాద్, ఇరిగేషన్ అడ్వయిజర్ వెంకటేశ్వరరావు, ఎస్ఈ అబూత్‌అలీ, మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు అశోకొరెడ్డి, కందుల, ఎరిక్షన్‌బాబు

అవీఇవీ

ఆ నలుగురికే పని

(5వ పేజీ తరువాయి)

చెప్పి ఇక్కడ, ఇక్కడఉన్నామని చెప్పి అక్కడవిధులకు గైర్హాజరవుతున్నారు.

సమస్యల వలయం..

జిల్లాలో సచివాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంలేదని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఎవరిష్టం వచ్చినట్లు వారు వస్తున్నారు.. పోతున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా కొలువుదీర్చిందే తప్ప ఎక్కడా కూడా పారదర్శకత, సహేతుకతకు చోటు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో సచివాలయాల రేషనలైజేషన్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన ఇది తయారైందే తప్ప ఈ హేతుబద్ధీకరణ ప్రక్రియ సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టకపోగా చిక్కుముళ్లను అలాగే మిగిల్చింది. ఇవన్నీ ఒక ఎత్తయితే అవసరం లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్ నియామకం మొదలుకుని, సదరు సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఇష్టారీతిన వివిధ విభాగాల్లో నియమించుకోవడం ఇవన్నీ కూడా యథావిధిగానే సాగుతున్నాయి. ప్రభుత్వం చెప్పినట్లుగా ఎక్కడా కూడా సిబ్బంది నియామకంలో జనాభా ప్రామాణికం అమలవుతున్న దాఖలాలే కనిపించడం లేదు. దీంతో సచివాలయాలు ఇంకా సమస్యల వలయంలోనే ఉన్నట్లు క్షేత్రస్థాయిలో కనబడుతోంది. గతంలోనూ, హేతుబద్ధీకరణ తర్వాత కూడా జిల్లాలో 477 సచివాలయాలు, 3,500 మంది సిబ్బంది ఉండటం ఎలా సాధ్యమనేది అంతుబట్టని ప్రశ్నగా ఉంది. అవసరం లేని విభాగాల్లో దాదాపు 400 మంది సిబ్బంది ఉన్నారని వారిని సర్దుబాటు చేసి ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. సీన్ కట్ చేస్తే అవే సచివాలయాలు, సిబ్బంది సంఖ్యలో కూడా మార్పులేదు. కానీ రేషనలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో దాదాపు 30 శాతం మంది డిప్యూటేషన్‌పై కలెక్టరేట్ విభాగాల్లోని పనిచేయడమో లేక ఫీల్డ్ విజిట్‌లో ఉండడమో జరుగుతోంది. ఒక సచివాలయంలో అడ్మిన్‌గా వ్యవహరిస్తున్న ఉద్యోగి మరో సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా 40 శాతం సచివాలయాల్లో దర్శనమిస్తున్నాయి. తాజాగా జరిగిన బదిలీల వల్ల కూడా సచివాలయాల్లో దాదాపు 120 వరకు ఖాళీలు ఏర్పడినట్లు సమాచారం.

అక్రమ అంతస్తుల క్రమబద్ధీకరణ

(5వ పేజీ తరువాయి)

వర్తిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భవనాలకు వర్తించదు. దరఖాస్తుతో పాటు ఈసీ, భవనం ఫొటోలు, ఇండెంటి బాండ్ తదితర పత్రాలు జతపరచాల్సి ఉంది. రూ.10 వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. భవనాలకు బిల్డప్ ఏరియా ప్లస్ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం అపరాధ రుసం విధిస్తారు.

జరిమానాలు ఇలా..

నిషేధిత స్థలాల్లో నిర్మించిన భవనాలకు బీసీఎప్ వర్తించదు. 50 చదరపు మీటర్లలోపు ఉన్న రెండు అంతస్తుల భవనాలను క్రమబద్ధీకరణ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. భవన నిర్మాణ అనుమతి రుసుం, అభివృద్ధి చార్జీలు విధిస్తారు. ప్లాన్ తీసుకుని అంతకు మించి నిర్మించిన ఫ్లోర్లకు జరిమానా విధిస్తారు. అపార్ట్‌మెంట్లలో ప్లాన్ లేకుండా నిర్మించిన ఫ్లోర్లకు 600 అడుగుల వరకు చదరపు అడుగుకు రూ.120, 601 నుంచి 1,200 అడుగుల వరకు రూ.150, 1,201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.180, ఆ పైబడిన నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంది. ప్లాన్ అతిక్రమించి నిర్మించిన భవనాలకు 600 చదరపు అడుగుల వరకు రూ.20వేలు, 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.40 వేలు, 1201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.60 వేలు, 2వేల అడుగులకు ఆ పైబడిన నిర్మాణానికి రూ.80 వేలు జరిమానా చెల్లించాలి.

పంచాయతీలు ప్రక్షాళన

గ్రామాల్లో నిరంతరాయంగా సేవలు

నాలుగు విభాగాలుగా పాలన.. ప్రత్యేక ఐటీ వింగ్

మున్సిపాలిటీల తరహాలో చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపంచాయతీల ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక నుంచి గ్రామాల్లో మున్సిపాలిటీల తరహాలో ప్రజలకు నిరంతరం సేవలు అందించనున్నాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా ప్రజలకు సేవలు వేగవంతంగా జరగడంతోపాటు పారదర్శకత పెరగనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా పనిచేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దుచేసి ఆయా పంచాయతీలను స్వతంత్రంగా ఏ ర్పాటు చేశారు. జిల్లాలో 729 గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం ఆదాయం, జనాభా ఆధారంగా విభజించారు. ప్రస్తుతం ఐదు గ్రేడ్‌లకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు ఉండగా ఒక గ్రేడ్ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. జిల్లాలో 38 మండలాలు ఉండగా ఆయా మండలపరిధిలో అధికంగా ఆదాయం ఉన్న 11 పంచాయతీలను స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలుగా ఏర్పాటు చేయగా, గ్రేడ్-1 పంచాయతీలు 75, గ్రేడ్-2 పంచాయతీలు 265, గ్రేడ్-3 పంచాయతీలు 373, జనాభా 500లోపు ఉన్న గ్రామ పంచాయతీలు ఐదు ఉన్నాయి. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నియమించనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా పిలవనున్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లకు సీనియార్టీని బట్టి ఉద్యోగోన్నతులు కల్పించి వారిని పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తారు.

ప్రజలకు సత్వర సేవలు

మునిసిపాలిటీల తరహాలోనే గ్రామ పంచాయతీల్లో పలు విభాగాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అదించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలుగా విభజించనున్నారు. వీటి ద్వారా సేవలు అందించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో విధానంలో సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకుంటారు. వారికి పంచాయతీ నిధుల నుంచే జీతాలు చెల్లిస్తారు. ప్రస్తుతం పంచాయతీల్లో అదనంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఇక నుంచి పంచాయతీల్లో ప్లానింగ్ అసిస్టెంట్లుగా పేర్కొంటారు. వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో భవనాలు, లేఅవుట్ రూల్స్‌ను అమలుచేసే విధగా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రత్యేకమైన ఐటీ విభాగాన్ని ఏర్పాటుచేసి అదనంగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హతలు ఉన్న సిబ్బందిని వినియోగించుకుంటారు. గ్రామ పంచాయతీల్లో డిజిటల్ విభాగాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేసింది. రికార్డులను డిజిటలైజేషన్ చేసి గ్రామపంచాయతీల్లో రియల్ టైంలో ప్రజలకు సర్వీసులు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

పాఠశాలల్లో తనిఖీలు

ఒంగోలు విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీలు ప్రారంభించింది. ఏటా 20శాతం పాఠశాలలు చొప్పున ఐదేళ్లల్లో వంద శాతం ఆడిట్ పూర్తిచేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 50 పాఠశాలలను ప్రభుత్వం సోషల్ ఆడిట్‌కు ఎంపిక చేశారు. జిల్లాలో తనిఖీల కోసం 29మంది డీఆర్పీలు, ఇద్దరు ఎస్ఆర్వోలు కలిపి 31మందిని నియమించారు. ఈనెల 10 నుంచి సోషల్ ఆడిట్ ప్రారంభం కావాల్సి ఉండగా ఆర్పీలు మంగళవారం నుంచి ప్రారంభించారు. మంగళ, బుధవారాల్లో 29 పాఠశాలల్లో పూర్తిచేశారు. గురు, శుక్రవారాల్లో మిగిలిన 21 పాఠశాలల తనిఖీలను పూర్తిచేయనున్నారు. సోషల్ ఆడిట్‌లో పుస్తకాలు, యూనిఫాం, క్రీడా పరికరాలన్నింటిని పరిశీలించారు. ఆయా అంశాలను అప్పటికప్పుడే యాప్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై ప్రశ్నించి వివరాలను రాబట్టారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి చిక్కీలను కూడా ఆర్పీలు లెక్కించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అక్కడ ఉన్న స్టాక్‌ను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పాఠశాలల రికార్డులన్నింటిని పరిశీలించారు. రెండు రోజుల పాటు అన్ని అంశాలను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఒంగోలు నగరంలో మూడు పాఠశాలలకు సంబంధించిన సోషల్ ఆడిట్ బుధవారం ముగిసింది.

రైలు పట్టాలు దాటుతూ వృద్ధురాలు మృతి

సంతమాగులూరు నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన పోలి శెట్టి మహాలక్ష్మమ్మ(60) బుధవారం పల్నాడు జిల్లా నరసరావుపేట మార్కెట్ సెంటర్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన డంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె ఏల్చూరులో చిన్నపాటి బీడీ బంకు పెట్టుకొని జీవిస్తుంటుంది. ఆమె భర్త రామారావు ఇదివరకే మృతి చెంది ఉన్నాడు. ఆమెకు ఉన్న ఇద్దరు పిల్లకూ వివాహాలయ్యాయి. ఆమెసరుకుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద లైన్ దాటుతుం డగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్‌లో మతిస్థిమితం లేని యువకుడు హల్‌చల్



పోలీసుల అదుపులో మతిస్థిమితంలేని యువకుడు

మార్టూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని స్టేట్‌బ్యాంక్ కార్యాలయంలో స్థానిక సుగాలీ కాల నీకి చెందిన బుక్యా అమర్‌సింగ్ నాయక్ అనే మతిస్థిమితం లేని యువ కుడు బుధవారం ఉదయం 11గంటల సమయంలో కొద్దిసేపు హల్‌చల్ చేశాడు. బ్యాంక్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా ఖాతాదారులు ఉన్న సమయంలో ఈ యువకుడు తన ఖాతాలో ఉన్న రూ.1500 కోట్లు ఎవరికి ఇచ్చారు, ఎందుకిచ్చారు, అన్ని పార్టీల వాళ్లు మా ఇంటికి వస్తున్నారంటూ పలు విధా లుగా మాట్లాడుతూ హల్‌చల్ చేశాడు. దానికితోడు యువకుని వద్ద కత్తి, గొడ్డలి ఉండటంతో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఆందోళనకు గుర య్యారు. ఈ సమయంలో బ్రాంచ్ మేనేజర్ వై.లెనిన్‌బాబు ఫోన్ ద్వారా సీఐ శేషగిరిరావుకు ఫిర్యాదుచేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సైదా, ఏఎస్‌ఐ బాషా తమ సిబ్బందితో బ్యాంక్‌కు చేరుకుని యువకుడిని అదు పులోకి తీసుకున్నారు. తల్లి, సోదరుని పూచీకత్తు మేరకు ఆ యువకుడిని పోలీసులు ఇంటికి పంపించి వేశారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

ఇంకొల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పట్టణ పరిధిలో లోఓల్టేజి సమస్యను పరిష్కరించేం దుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల ను మంజూరు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపా రు. శుక్రవారం నుంచి నూతన ట్రాన్స్ ఫార్మర్లను బిగించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సూర్యఘర్‌కు అర్జీలు పెట్టుకోవాలని సూచించారు.

పేదల సొంతింటి కల సాకారం

మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంలో పలు గృహ ప్రవేశాలు

ఇంటి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కొండయ్య



యజమానురాలితో కలిసి గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



లబ్ధిదారులకు ఇంటి తాళం అందజేస్తున్న డీఈ ఖాదర్‌వలి, ఏఈ రాహుల్

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతి పేదవాని సొంతింటి కల సాకారం దిశగా అడు గులు వేస్తున్నా, ప్రతి ఒక్కరూ సహక రించాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 1వ వార్డు 300 కాలనీలో మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిర్మించిన నూతన సామూహిక గృహాలలో ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పేద కుటుం బానికి సొంతిల్లు ఉండాలనే ఎన్‌టీఆర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నిర్విరామ పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అధికారం చేపట్టిన 17 నెలల్లో సుమారు 3 లక్షల నూతన గృహప్రవేశాలు నిర్వహించినట్లు చెప్పారు. చేనేత చీరకు జాతీయ గుర్తింపు, ఇటీవల ఆటోనగర్ సమ స్యకు పరిష్కారం, అలాగే క్రిటికల్ కేర్ నిర్మాణంతో పాటు నేడు నూతన గృహ ప్రవేశాలు ఆనందాన్నిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా మేనే జర్ కొండయ్య, హౌసింగ్ ఏఈ శ్రీని వాస్ పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

మార్టూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని పేద కుటుంబా లకు ప్రభుత్వ సహకారంతో పక్కా ఇ ళ్లను నిర్మింపచేయడమే ప్రభుత్వ లక్ష్య మని హౌసింగ్ డీఈ ఎస్.కె.ఖాదర్‌వలి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో హౌసింగ్ పథకం ద్వారా మంజూరై మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్కాఇళ్లకు ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేసింది. ఆ నిధు లతో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు బుధవారం వలార్పూరులో మద్ది సీతాదేవి నగర్‌లో గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమానికి హౌసింగ్ ఏఈ రాహుల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈ ఖాదర్‌వలి మాట్లా డుతూ ప్రజా ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయడంతో మండలంలో 106 పక్కాఇళ్ల నిర్మాణం పూర్తయింద న్నారు. ఒక మార్టూరు పట్టణంలో 24 ఇళ్ళ నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వ రరావు, తొండెపు ఆదినారాయణ, తాటి అంజనేయస్వామి, దిబ్బయ్య, వీరాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో....

అద్దంకి, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సొంతిల్లు కట్టించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని స్వచ్ఛాంధ్ర కార్పొరే షన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు చెప్పారు. అద్దంకి పట్టణంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత 90 ఇళ్లు నిర్మించారు. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని రాజీ వ్‌కాలనీలో గృహప్రవేశం జరిగింది. మరో 170 మంది లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, హౌసింగ్ ఇంచార్జి డీఈ దుర్గార మేష్, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిల ర్‌లు రజనీ, మాగులూరి తిరుపతమ్మ, అత్తులూరి రమేష్, టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, చిలు కూరి అనిల్, గార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న లబ్ధిదారులు, అధికారులు, నేతలు

చంద్రన్న పాలనలో పేదలకు సొంతిల్లు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న పాలనలో పేదలకు సొంతింటి కల సాకారం అవుతుందని, ఎన్టీఆర్ ఆశయాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తోందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రంలో కేవలం 16 నెలల్లోనే 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందజేయటం చారిత్రాత్మక అంశం అన్నారు. పేదలం దరికీ ఇళ్లు ఇస్తామని చెప్పి సెంటు పట్టా పేరుతో జగన్ రెడ్డి ప్రభుత్వం రూ.7,500 కోట్లు దోపిడికీ పాల్పడిందని ఆరోపించారు.

4 లక్షల ఆర్థిక సాయం

గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి స్థలం కల్పిస్తుందని, సొంత స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకో లేని వారికి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. అందులో రాష్ట్ర వాటా 40 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం ఉండటం వల్ల ఈపథకం మరింత బలపడిందని ఏలూరి పేర్కొన్నారు. 2029 పాటిరి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించడమే చంద్రబాబు లక్ష్యమన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి

మోడల్ స్కూల్ ముందు బైఠాయించిన విద్యార్థులు

ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ వేధింపులు తాళలేమంటూ వాపోయిన వైనం

విచారణ చేపట్టిన అధికారులు



డీఈవో పురుషోత్తంకు సమస్యల పత్రం అందిస్తున్న విద్యార్థినులు

బుర్లవారిపాలెం(చీరాల), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని బుర్లవారిపాలెం వద్ద గల ఏపీ మోడల్ స్కూల్ ముందు ఆ పాఠశాల విద్యార్థులు బుధవారం బైఠాయించారు. ప్రిన్సిపల్ సరళ, వైస్ ప్రిన్సిపల్ సామ్యేల్ విద్యార్థుల నుంచి అధికంగా నగదు వసూళ్లు చేస్తుండటంతో పాటు బెదిరింపులకు పాల్పడు తున్నట్లు వారు ఆరోపించారు. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వారు చెబుతున్నారు. విద్యార్థుల ఆందోళన చేపట్టి విష యాన్ని తెలుసుకున్న డీఈవో పురుషోత్తం, జీసీడీవో చారులత, తహసీల్దార్ గోపీకృష్ణ హుటాహుటిన స్కూలు వద్దకు చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వినతిపత్రం స్వీకరించారు. అలాగే ప్రిన్సిపల్ సెలవులో ఉండటంతో వైస్ ప్రిన్సిపల్, ఇతర సిబ్బందిని సమస్యపై ఆరా తీశారు. విద్యార్థులకు కొంత నగదు వెనక్కి అందజేసినట్లు వైస్ ప్రిన్సిపల్ అధికారులకు సమాధా నమిచ్చారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికా రులు హామీ ఇచ్చారు. ఒక దశలో స్కూల్ కమిటీ ప్రతినిధులకు ఉపాధ్యా యులకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య కొంత వాగ్వివాదం చోటుచే సుకుంది. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై నాగశ్రీను సిబ్బందితో సంఘటనా స్థలా నికి చేరుకుని పరిస్థితి సర్దుబాటు చేశారు.

భూసేకరణపై జేవీపాలెం రైతుల అభిప్రాయసేకరణ

విజయవాడ, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపై చర్చించిన ఆర్డీవో చంద్రశేఖరనాయుడు



రైతులతో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి నిర్మితమవుతున్న విజయ వాడ, కడప, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ జాతీయరహదారికి అవసరమైన భూసేకరణకు సంబంధించి జేవీ పాలెం రైతులతో ఆర్డీవో చంద్రశే ఖరనాయుడు అభిప్రాయసేకరణ చేపట్టారు. ముప్పవరం సచివాల యంలో బుధవారం జరిగిన సమావేశంలో మూడో విడత సేక రిస్తున్న ఎకరా 58 సెంట్ల భూమికి సంబంధించిన విస్తీర్ణంపై రైతుల అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. తొలివిడత 28.76 ఎక రాల భూసేకరణ చేయగా, రెండో విడత 5.39 ఎకరాల వ్యవసాయ భూమిని రైతుల నుంచి సేకరించారు. రెండో విడత భూసేకరణలో మిగిలిపో యిన ఎకరా 58 సెంట్లకు సంబంధించి విస్తీర్ణంలో వ్యత్యాసాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ భూమికి సంబంధించి అవార్డు ప్రక టించి భూమిని సేకరిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. వ్యవసాయభూమే తమ జీవనాధారమని, ఎకరాకు రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని రైతులు ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైవే అధి కారి హస్సాన్, తహసీల్దార్ సింగారావు, టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొం డలు, గరిమిడి జగన్మోహన్, వీఆర్వో సుబ్బారావు, సర్వేయర్ అనంతారెడ్డి, రైతులు మహేష్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడు పరిశీలన

ముప్పవరం సచివాలయంలో భూసే కరణపై రైతుల అభిప్రాయ సేకరణకు వచ్చిన ఆర్డీవో చంద్రశేఖరనాయుడుకు టీడీపీ నేతలు సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరునిలవడంతో రాకపోకలకు ఇబ్బం దిగా ఉందని వివరించారు. సమస్యను పరిశీలించాలన్న ఆర్డీవో సూచనతో హైవే అధికారి హస్సాన్ ఆ రోడ్డును పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వాస్తుకు విరుద్ధంగా శింగరకొండ నిర్మాణాలు

వీలైనంత త్వరగా పునఃనిర్మాణం చేపట్టాలి

ప్రసన్నాంజనేయస్వామి రాజ గోపురాలు, ప్రాకార మండపం పరిశీలించిన స్మార్త ఆగమ సలహాదారు విజయభాస్కరశాస్త్రి



దేవస్థానాన్ని పరిశీలిస్తున్న స్మార్త ఆగమ సలహాదారులు విజయభాస్కరశాస్త్రి

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురాలు, ప్రాకారం వాస్తు, శాస్త్ర విరుద్ధంగా ఉన్నాయని, వీలైనంత త్వరగా పునఃనిర్మాణ పనులు ప్రారంభించాలని స్మార్త ఆగమ సలహాదారు విజయ భాస్కరశాస్త్రి చెప్పారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాజగోపురాలు, ప్రాకారాలను దాతల సహకారంతో పునః నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం స్మార్త ఆగమ సలహాదారులు విజయ భాస్కరశాస్త్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయభాస్కరశాస్త్రి మాట్లాడుతూ పునఃనిర్మాణ పనులు ఆలస్యమైతే దేవస్థానం అభివృద్ధికి ఆటంకాలు కలుగుతాయన్నారు. గణపతి, సుబ్రహ్మణ్యం స్వామిల దేవాలయాలను కూడా పునఃనిర్మాణం చేయాలని సూచించారు. రాజగోపురాలు, ప్రాకార మండపాల పునఃనిర్మాణం, గోశాల, కోనేరు, మరుగుదొడ్ల నిర్మాణం సమయంలో పాటించాల్సిన వాస్తు గురించి వివరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, వేదపండితులు వంగల హరిశంకరావధాని, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వైద్యకళాశాల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలి

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం వెంటనే విరమించుకో వాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి శ్యామల చెప్పారు. వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గేమ్ ఛేంజర్ అయితే నాలుగుసార్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు నేమ్ ఛేంజర్‌గా మారారని విమర్శించారు. అన్ని పథకాలకు పేర్లు మార్చటం తప్పా ఏమి అభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.



ర్యాలీలో శ్యామల, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

అవీఇవీ

గృహాలకు వాడే సైజు రాళ్లకు సీనరేజ్ వసూళ్లపై ఆగ్రహం



ట్రాక్టర్‌ను నిలిపేసిన సిబ్బంది

రామాంజనేయపురం వద్ద రాళ్ల ట్రాక్టర్‌ను నిలిపిన కంపెనీ సిబ్బంది

బల్లికురవ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : కొండ ప్రాంతంలో వృథాగా పడి ఉన్న రాళ్లను సైజు రాళ్లుగా చేసుకుని గృహాలకు తరలిస్తుంటే వాటికి సీనరేజ్ కట్టాలని ఓ కంపెనీ ప్రతినిధులు అడ్డుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలకు వెళ్లే రాళ్లకు సీనరేజ్‌లు వసూలు చేసుకోవాలని, గృహాలకు వినియోగించే మట్టి, రాళ్లకు సీనరేజ్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం ఉదయం రామాంజనేయపురం వద్ద ఒక ఇంటికి రైతు తీసుకుపోతున్న సైజు రాళ్ల ట్రాక్టర్‌కు సీనరేజ్ చెల్లించాలని కంపెనీ సిబ్బంది నిలుపుదల చేశారు. ఇలా అయితే గృహాలు ఎలా కట్టుకోవాలని వారు ప్రశ్నించారు. నిలుపుదల చేసిన సిబ్బంది మాత్రం తాము ఏమి చేయలేమని, తాము జీతాలకు పనిచేస్తున్నామని మీరు కట్టాల్సిందే అని అనటంతో చేసేది లేక సీనరేజ్ చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకుపోయారు. నిబంధనలను సడ లించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే గృహాల నిర్మాణాలు చేయటం చాలా కష్టం అవుతుందని వారు అంటున్నారు.

వంతెనలను త్వరగా నిర్మించాలి

వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



కూలిన వంతెనను పరిశీలిస్తున్న వెంకటేష్

రామాపురం(చీరాల), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతాల్లో నూతన వంతెనల ఏర్పాటు వేగవంతంగా జరగాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ చెప్పారు. బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వాడ రేవు - రామాపురం మార్గంలో తుఫాన్ కారణంగా కూలిన వంతెనలను పరిశీలించారు. మొంథా కారణంగా ఒకవైపు మత్స్యకార కుటుంబాలు, మరొక వైపు రైతన్నలు, నేతన్నలు పూట గడవని పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టాలతో పాటు, దెబ్బతిన్న రోడ్లు, వంతెనల ఏర్పాటుపై చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ప్రభుత్వం మెడికల్ కళాశాలల పట్ల తీరును నిరసిస్తూ పట్టణంలోని ముక్కోణం పార్కు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డితో ర్యాలీ నిర్వహించి, వినతిని అందజేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక ఆదాయం



సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి చెప్పారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం, అలవలపాడు గ్రామాలలో బుధ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చినబాబు, గోపీకిరణ్, రైతులు పాల్గొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌తో ఉత్తీర్ణత శాతం పెంచాలి



స్కూల్‌ను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శివకుమార్

అద్దంకి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శివకుమార్ చెప్పారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్‌లో ఎస్ఏ 1 పరీక్షలను బుధవారం శివకుమార్ పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడీ పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాల న్నారు. సీ, డీ గ్రేడ్ ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయండి

పార్టీలో 1400 మందికి పదవులు

మండల పార్టీ అధ్యక్షులుగా పురుషోత్తం, సీతారామాంజనేయులు

పట్టణ అధ్యక్షునిగా వెంకట సురేష్ నియామకం

ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కొండయ్యను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

చీరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పదవులు పొందిన వారు పనిచేయా లని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాల యంలో జరిగిన సమావేశంలో 1400 మందికి పట్టణ, మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ పదవులను కేటాయించారు. వీరిలో చీరాల మండల టీడీపీ అధ్యక్షునిగా గంజి పురుషోత్తం, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షునిగా గుత్తి సీతారామాంజనేయులు ఎన్నిక య్యారు. పదవులు పొందిన వారితో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణలు ఉల్లంఘించకుండా నిబద్ధతతో టీడీపీ సిద్ధాంతాన్ని అనుసరించి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం నేతలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిం చారు. పట్టణ అధ్యక్షునిగా దోగుపర్తి వెంకట సురేష్ నియమించారు.